


13న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న బి.లీలా వెంకటశేషాద్రి

కర్నూలు లీగల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు డిసెంబరు 13న జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి కోరారు. ఈ మేరకు గురువారం కర్నూలు నగరంలోని న్యాయ సేవా సదన్ భవన్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కోర్టులలో పెండింగ్‌లో ఉన్న కేసులు, మోటారు యాక్సిడెంటు కేసులు, బ్యాంకు మున్సిపాలిటీ, బీఎస్ఎన్ఎల్ కేసులతో పాటు ప్రిలిటిగేషన్ కేసులను కూడా ఈ లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకుని తమ కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పలు బ్యాంక్ మేనేజర్లు, మున్సిపల్ అధికారులు, ఇన్సూరెన్స్, బీఎస్ఎన్ఎల్ అధికారులు పాల్గొన్నారు.

పారదర్శకంగా పత్తి కొనుగోలు : కలెక్టర్



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సిరి

గూడూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ సిరి సీసీఐ అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలోని పెంచికలపాడు గ్రామంలో మంజిత్ కాటన్ జిన్నింగ్, ప్రెషసింగ్ యూనిట్‌లో సీసీఐ ద్వారా జరుగుతున్న పత్తి కొనుగోలు ప్రక్రియకు సంబంధించి అధికారులు, రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా పత్తి రైతులు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ పత్తిని బాగా ఆరబెట్టుకుని తీసుకురావాలని సూచించారు. స్లాట్ బుకింగ్‌లో సచివాలయ సిబ్బంది తగిన సహకారం అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. పత్తిని తీసుకువచ్చిన రైతులను వెనక్కి పంపవద్దని, రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట మార్కెటింగ్ ఏడీ నారాయణమూర్తి, గూడూరు తహసీల్దార్ వెంకటేశ నాయక్, ఏవో దస్తగిరి రెడ్డి ఉన్నారు.

రోగుల అడ్మిషన్ ఎంట్రీలు బాగోలేవు

- డిసెంబరు చివరికి ఓపీ పనులు పూర్తి చేయాలి
- కర్నూలు జీజీహెచ్‌లో కలెక్టర్ తనిఖీలు

కర్నూలు హాస్పిటల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అడ్మిషన్ అయిన రోగుల కేస్‌షీట్ వివరాలు సరిగ్గా రాయాలని, ఐపీ, ఓపీ వివరాలు సమగ్రంగా లేవని కలెక్టర్ డాక్టర్ సిరి వైద్యులపై అసహనం వ్యక్తం చేశారు. గురువారం ఉదయం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో క్యాజువాల్టీ, మేల్ ఓపీ, క్రిటికల్ ఎమర్జెన్సీ, సూపర్ స్పెషాలిటీ బ్లాక్, న్యూడయోగ్నస్టిక్ బ్లాక్‌లను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా కలెక్టర్ క్యాజువాల్టీలోని ఎమర్జెన్సీ మెడిసిన్ వార్డులో చికిత్స తీసుకుంటున్న రోగులు, వారి బంధువులతో మాట్లాడారు. వైద్యులు ఎలా చికిత్స అందిస్తున్నారు? ఏ కారణం చేత అడ్మిట్ అయ్యారు? సమయానికి మందులు ఇస్తున్నారా? వైద్యులు సరిగ్గా స్పందిస్తున్నారా? సరిగ్గా మాట్లాడుతున్నారా? అని ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. రోగులకు సంబంధించిన రిజిస్టర్ రోగ నిర్ధారణ ఐపీ నెంబర్ల నమోదు సరిగ్గా చేయడం లేదని, ఎంట్రీలు సక్రమంగా చేయాలని ఆర్థో విభాగపు వైద్యులను కలెక్టర్ ఆదేశించారు.

వ్యర్థాలు తొలగించకపోవడంపై ఆగ్రహం

చాలా వార్డుల్లో వ్యర్థాలు అలాగే ఉందని, ఎందుకు తొలగించలేదంటూ వైద్యాధికారులను కలెక్టర్ ప్రశ్నించారు. ఏఎంసీ యూనిట్‌లో మహిళలకు, పురుషులకు ఒకే టాయిలెట్ ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలోని టాయిలెట్‌లను మరమ్మతులు చేయించేందుకు రూ.10 లక్షలతో ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లోని యూరాలజీ, న్యూరోసర్జరీ ఆపరేషన్ థియేటర్ల పనులు నవంబరు 20లోపు పూర్తి చేయాలని, ఎందుకు చేయలేదని ఏపీఎంఎస్ఐసీ ఇంజనీర్లు కాంట్రాక్టర్‌ను ప్రశ్నించారు. డిసెంబరు చివరికల్లా పూర్తి చేస్తామని వారు కలెక్టర్‌కు వివరించారు. ఈ తనిఖీల్లో జీజీహెచ్ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు, డిప్యూటీ సూపరింటెండెంట్ లక్ష్మీబాయి, ఆర్ఎంవో వెంకటరమణ, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ చిరంజీవులు పాల్గొన్నారు.



జనరల్ సర్జరీ ఓపీలో రోగిని పరిశీలిస్తున్న కలెక్టర్

అదుపులో శాంతిభద్రతలు: ఎస్పీ



మంత్రాలయంలో పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

మంత్రాలయం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శాంతి భద్రతలు, నేరాలు అదుపులోనే ఉన్నాయని ఎస్పీ విక్రాంత్‌పాటిల్ అన్నారు. గురువారం మంత్రాలయం, మాధవరం పోలీస్‌స్టేషన్లను ఆయన పరిశీలించారు. ముందుగా డీఎస్పీ భార్గవి, సీఐ రామాంజులు, మాధవరం ఎస్ఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్‌లో మొక్కలు నాటారు. అనంతరం పోలీస్‌స్టేషన్లలో రికార్డులను పరిశీలించారు. రోడ్డు ప్రమాదాలు, నేరాలు, మట్కా, చోరీలు, మిస్సింగ్ వంటి కేసులపై ఆరాతీశారు. మంత్రాలయంలో ట్రాఫిక్, రద్దీపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లాలో 5 శాతం రోడ్డు ప్రమాదాలు పెరిగాయన్నారు. కర్ణాటక మద్యం, మట్కా, దొంగతనాల నివారణకు ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. మంత్రాలయంలో రోజురోజుకు పెరుగుతున్న భక్తుల రద్దీ దృష్ట్యా అదనపు పోలీసులను ఏర్పాటు చేస్తామని తెలిపారు. సాయంత్రం ఎస్పీ విక్రాంత్ పాటిల్ శ్రీమఠాన్ని సందర్శించారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి పూజలు చేశారు. అనంతరం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాలక్షింతలు ఇచ్చి ఎస్పీని ఆశీర్వదించారు.

ఆహా.. ఆక్వా..!

జీవ వైవిధ్యం, ఆహార భద్రత, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అనే మూడింటితో ముడిపడినదే మత్స్యఉత్పత్తి రంగం. లక్షలాది మంది ఉపాధికి మత్స్య సంపద ఎంతో కీలకం. కాలుష్యం, పెరుగుతున్న ఎండల ప్రభావంతో చేపల ఉత్పత్తి క్రమేణా తగ్గుతోంది. నంద్యాల జిల్లాలో ప్రత్యేకమైన భౌగోళిక నిర్మాణం, వర్షాధార జల వనరులు, చెరువుల వ్యవస్థ, కాలానుగుణ ఉష్ణోగ్రత మార్పులు మొదలైనవి మత్స్య ఉత్పత్తిపై ప్రత్యక్ష ప్రభావం చూపుతున్నాయి. దీని వల్ల మత్స్యకారులకు బతుకు భారమైపోయింది. ప్రతి యేటా నవంబరు 21 జరుపుకునే ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా మత్స్యకారుల సమస్యలు చర్చనీయాంశం అవుతాయి. దీన్ని పురస్కరించుకొని ప్రత్యేక కథనం.



సుంకేసుల జలాశయంలో మత్స్యకారుడి చేపల వేట

- జిల్లాలో 37,981 టన్నుల ఉత్పత్తి లక్ష్యం
- జీవీఏలో మత్స్య సంపద వాటా రూ.723 కోట్లు
- ప్రధానంగా లభించే చేపలు బొచ్చె, రాగండి
- నేడు అంతర్జాతీయ మత్స్య దినోత్సవం

కర్నూలు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): చేపలు.. జల పుష్పాలగా ప్రసిద్ధి. మనిషికి అవసరమైన విటమిన్లు (బీ2), ఒమేగా-3, కొవ్వు అమ్లాలు, ఇనుము, మెగ్నీషియం వంటి సూక్ష్మపోషకాలు చేపల్లో పుష్కలంగా ఉంటాయి. రాష్ట్రంలో చేపల పెంపకం, మార్కెటింగ్ రంగంలో జిల్లా వాటా అత్యల్పమే. అయినా దేశంలో మత్స్య సందప అభివృద్ధి, ఉపాధి కల్పనలో ప్రభుత్వాలు తీసుకొస్తున్న సంస్కరణలు, నూతన సాంకేతిక పరిజ్ఞానం రైతులకు తోడు కావడంతో ఆ రంగంపై ఆధారపడిన రైతులు ఇప్పుడిప్పుడే ప్రగతి వైపు అడుగులు వేస్తున్నారు. జిల్లాలో సుంకేసుల, గాజులదిన్నె ప్రాజెక్టు, పులికనుమ, పందికోన, కృష్ణగిరి జలాశయాలు సహా 52 మైనర్ ఇగిరేషన్ చెరువులు చేపల పెంపకం, మత్స్యకారులకు జీవనోపాధి కల్పించేందుకు అనువుగా ఉన్నాయని గుర్తించారు. 29 మత్స్యకారుల సహకార సంఘాలు ఉన్నాయి. సుంకేసుల జలాశయం, తుంగభద్ర నదిలో చేపల వేటకు మత్స్యకారులకు లైసెన్సులు ఇస్తారే తప్ప వేలం వేయరు. గాజులదిన్నె జలాశయంలో గాజులదిన్నె మత్స్యకారుల సహకారం సంఘం ఒక్కటే చేపలు పెంపకం, వేటకు అనుమతి ఇస్తారు. పులికనుమ, పందికోన, కృష్ణగిరి జలాశయాలు, ఆయా చెరువుల్లో చేపలు పెంపకం, వేట సాగించేందుకు మత్స్య శాఖ అధికారులు ఏటేటా బహిరంగ వేలాం ద్వారా లీజుదారులకు అప్పగిస్తారు. వేలం ద్వారా ఏటా రూ.25 లక్షల వరకు ఆదాయం వస్తుందని అంచనా. తుంగభద్ర నది, సుంకేసుల జలాశయంలో చేపల వేటపై వెయ్యి కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయి.

రూ.723 కోట్ల లక్ష్యం

చేపలు, రొయ్యలు ఉత్పత్తి, అమ్మకాలు ద్వారా జీవీఏ రూ.723 కోట్ల లక్ష్యం. జిల్లా స్థూల ఉత్పత్తిలో చేపల వాటా కూడా ఎంతో కీలకమే. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 37,981 టన్నులు చేపల ఉత్పత్తి లక్ష్యం కాగా ఇప్పటి వరకు 16,635 టన్నులు, 116 టన్నులు రొయ్యలు ఉత్పత్తి లక్ష్యం కాగా 21 టన్నులు ఉత్పత్తి చేసినట్లు రికార్డులు ద్వారా తెలుస్తోంది. జిల్లాలో ప్రధానంగా బొచ్చె, రాగండి చేపలు లభిస్తాయి. నదులు, చెరువుల్లో సహజంగా తిలాపియ (గురక), కొర్రమీను చేపలు పెరుగుతున్నాయి. మార్కెట్లో వీటి ధర తక్కువగా ఉంటుంది. ఈ ఏడాది వర్షాలు అధికంగా ఉన్నప్పటికి జలాశయాలు, చెరువుల్లో పూడిక చేరడం, నీటి నిల్వ సామర్థ్యం తగ్గడం చేపల పెంకపంపై తీవ్ర ప్రభావం చూపుతుందని మత్స్య శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

70 లక్షల చేప పిల్లల ఉత్పత్తి లక్ష్యం

సుంకేసుల ఫిష్ సీడ్ ఫారంలో 35 లక్షలు, గాజులదిన్నెలో 20 లక్షలు, కర్నూలు ఫిష్ ఫారంలో 15 లక్షలు చొప్పున 70 లక్షల చేప పిల్లల ఉత్పత్తి లక్ష్యంగా పెట్టు కున్నారు. ఆ దిశగా పెంపకం చేస్తున్నారు. గతంలో నీటి వనరుల్లో చేపల పెంపకం కోసం నదుల నుంచి విత్తనాన్ని సేకరించేవారు. దీని వల్ల చేపల ఉత్పత్తి ఆశించిన స్థాయిలో వచ్చేదికాదు. 1957 జూలై 10న ఒడిశాలోని కటక్ పరిశోధన కేంద్రలో డాక్టర్ కేహెచ్ అలికున్ని, డాక్టర్ హెచ్.హీరాలాల్ చౌదరి అనే శాస్త్రవేత్తలు కార్ప్ చేపలలో పునరుత్పత్తిని (హైపో ఫిసేషన్) అనే సాంకేతికతను ప్రవేశ పెట్టి విజయం సాధించారు. ఇది ఆక్వాకల్చర్ విప్లవానికి నాంది పలికింది. ఆనాటి నుంచి చేప పిల్లల ఉత్పత్తి ఎంతో సులభతరంగా మారింది. ఈ ఏడాది జిల్లాలో 70 లక్షలు పిల్లలు ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకుంటే.. పెం పకంలో కొంత నష్టపోక తప్పదు. 82-100 ఎంఎం చేప పిల్లలు ఉత్పత్తి చేసి శ్రీశైలం జలాశయంలో 51.50 లక్షలు, సుంకేసుల జలాశయంలో 3.50 లక్షలు చేప పిల్లలను వదిలేందుకు సన్నాహాలు చేస్తున్నారు.



గాజులదిన్నె సీడ్ ఫారంలో కోటి పిల్లలు పెంపకం

జిల్లాలో తొలిసారిగా గాజులదిన్నె మత్స్యకారుల సహకార సంఘం ఆధ్వర్యంలో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద కోటి చేప పిల్లలు పెంపకానికి శ్రీకారం చుట్టారు. తుంగభద్ర డ్యాం నుంచి కోటి చేప పిల్లల ఉత్పత్తి గుడ్లు తెచ్చి మత్స్య శాఖకు చెందిన ఫిష్ సీడ్ ఫారంలో ఆ శాఖ అధికారుల సలహా మేరకు పెంపకం చేపట్టారు. చివరికి 25 లక్షల చేప పిల్లలు మిగులుతాయి. వీటి విలువ దాదాపుగా రూ.40 లక్షలు ఉంటుందని అంచనా. వాటిని జీడీపీ జలాశయంలో వదులుతారు. కోటి గుడ్లు కొనుగోలుకు రూ.1.50 లక్షలు, పెంపకం కోసం మరో రూ.10-15 లక్షలు ఖర్చు చేశారు. అలాగే.. గూడూరు మత్స్యకారుల సహకార సంఘం ఆధ్వర్యంలో కూడా 60 లక్షలు చేప పిల్లలు పెంపకానికి చర్యలు చేపట్టారు.

మరిన్ని కథనాలు 6లో

దిశ కమిటీలో నలుగురికి చోటు

- ఉత్తర్వులు జారీ చేసిన కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ
- జిల్లా అభివృద్ధిలో కీలక పాత్ర



కె. దేవశంకర్ | ఎస్. విశ్వనాథ్‌రెడ్డి | జి. సురేంద్రనాథ్ | కె. రాధ

కర్నూలు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధిలో కీలక పాత్ర పోషించే జిల్లా అభివృద్ధి సమన్వయం, పర్యవేక్షణ కమిటీ (దిశ) నాన్ అఫీషియో సభ్యులుగా నలుగురికి అవకాశం దక్కింది. ఎంపీ బస్తిపాటి నాగరాజు సిఫారసు మేరకు దిశ కమిటీ సభ్యులుగా బీసీ కోటాలో కర్నూలుకు చెందిన కె.దేవశంకర్, జనరల్ కోటాలో దేవనకొండకు చెందిన ఎస్.విశ్వనాథ్‌రెడ్డి, ఎస్సీ కోటాలో పంచాయతీ రాజ్ రిటైర్డ్ ఎస్ఈ జి.సురేంద్రనాథ్, బీసీ మహిళా కోటాలో సామాజికసేవా కార్యకర్త కె. రాధను నియమిస్తూ కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అండర్ సెక్రెటరీ పీయూష్ రాజన్ ఉత్వర్వులు ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీ చైర్మన్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అధ్యక్షతన శుక్రవారం (నేడు) కర్నూలులో జరిగే దిశ కమిటీ తొలి సమావేశానికి నాన్ అఫీషియో సభ్యులుగా హాజరు కానున్నారు. జిల్లా అభివృద్ధి కోసం ఎంపీ, ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థలు (పంచాయతీరాజ్, మున్సిపల్) ప్రజా ప్రతినిధుల మధ్య సమన్వయం కోసం దిశ కమిటీ కీలకంగా పని చేస్తుంది. అవసరమైతే ఈ కమిటీ అభివృద్ధి పనులను కూడా పర్యవేక్షించే అవకాశం ఉంది. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఎంపీ అధ్యక్షతన జరిగే దిశ కమిటీ సమావేశాలకు మంత్రులు, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలతో పాటు వివిధ శాఖ అధికారులు హాజరవుతారు. సమావేశంలో అభివృద్ధిపై చర్చించడం, సమాచారం తీసుకోవడం, అవసరమైతే పర్యవేక్షణ చేయడం ఆ కమిటీకి సంపూర్ణ అధికారాలు ఉంటాయి. సమావేశాలు నిర్వహించడం, వివిధ శాఖ సమాచారం తెప్పించడం, ఫాలోఅప్ చేయడానికి కలెక్టర్ సభ్య కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుంది.

పది క్వింటాళ్ల పత్తిని అమ్ముకోవచ్చు

- వ్యవసాయ శాఖ ఏడీఏ శాలురెడ్డి

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సీసీఐ సంస్థ ఒక్కో రైతు ఒకసారి పది క్వింటాళ్ల పత్తిని అమ్ముకునేందుకు అవకాశం కల్పించిందని వ్యవసాయ శాఖ కర్నూలు డివిజన్ ఏడీఏ శాలురెడ్డి తెలిపారు. గురువారం కర్నూలు నగరంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కోడుమూరు పరిధిలోని పెంచికలపాడు వద్ద ఉన్న సీసీఐ కొనుగోలు కేంద్రంలో రైతులు పత్తిని అమ్ముకోవాలని తేమ శాతం 8 నుంచి 14 శాతం దాకా కలెక్టర్ డాక్టర్ సిరి ఆదేశాల మేరకు అవకాశం ఉందని శాలురెడ్డి స్పష్టం చేశారు. రైతులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో తాము పండించిన పత్తికి సంబంధించిన వివరాలను ఈక్రాప్‌తో పాటు సీఎం యాప్‌లో నమోదు చేయించి తర్వాత కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకుని కొనుగోలు కేంద్రానికి పత్తిని తీసుకెళ్లాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. రైతులు ప్రభుత్వం నిర్ణయించిన గిట్టుబాటు ధరను అందుకునేందుకు సీసీఐ కేంద్రాల్లోనే పత్తిని తీసుకెళ్లాలని గ్రామాల్లో దళారులకు, వ్యాపారులకు అమ్మి నష్టపోవద్దని విజ్ఞప్తి చేశారు.

మహా మోసం

- పత్తి రైతులను మోసగిస్తున్న మహారాష్ట్ర వ్యాపారులు
- నిబంధనలకు విరుద్ధంగా ఇళ్ల వద్ద తూకాలు
- క్వింటాకు 20 కిలోల కోత
- అధిక ధర ఆశ చూపి అన్యాయం

ఆదోని, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రేయనక..పగలనకా నాలుగు నెలలు కష్టపడి పండించిన పత్తిపంటను మహారాష్ట్ర వ్యాపారులు దోచుకుంటున్నారు. అధిక ధర ఆశచూపిస్తూ ఇళ్లవద్దే పత్తిని కొనుగోలు చేస్తున్నారు. తక్కెడ వాళ్లవే.. తూకం రాళ్లూ వాళ్లవే.. ఇంకేముంది కిలోల కొద్ది తక్కువ తూకాలతో రైతులను నిండా ముంచేస్తున్నారు. అడ్డగోలుగా తూకాలు వేస్తూ పత్తి రైతులను ఏమార్చుతూ మోసగిస్తున్నారు. ప్రస్తుతం ఆదోని మార్కెట్‌లో మంచి నాణ్యత గల పత్తి క్వింటా రూ.7,330 వరకు గరిష్ఠ ధర పలుకుతోంది. అయితే మహారాష్ట్రకు చెందిన వ్యాపారులు రంగంలోకి దిగి పత్తి నాణ్యత (క్వాలిటీ)తో సంబంధం లేకుండా కేవలం రూ.7,300 చొప్పున ధర ప్రకటించి రైతులను ఆకర్షిస్తున్నారు. ఆదోని మార్కెట్‌లో లభించే గరిష్ఠ ధరకు దగ్గరగా ఈ రేటు ఉండడంతో రైతులు తమ దిగుబడులను మార్కెట్‌కు కాకుండా నేరుగా మహారాష్ట్ర వ్యాపారులకే అమ్ముకుంటున్నారు. మార్కెట్‌కు వెళ్లకుండా రవాణా ఖర్చులు కలసివస్తాయని రైతుల ఆశ. అయితే ఈ ఆశనే వ్యాపారులు గుర్తించి పత్తికొనుగోలు చేసే సమయంలో తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారు. ఎలక్ట్రానిక్ కాటాలకు బదులు తక్కెడలను వినియోగిస్తున్నారు. నిజానికి తూనికలు కొలతల శాఖ ఆదేశాల మేరకు భారీ మొత్తంలో జరిగే కొనుగోళ్లకు ఎలక్ట్రానిక్ కాటాలు మాత్రమే వాడాలి. ఎలక్ట్రానిక్ కాటాల్లో మోసం చేయడానికి అవకాశం ఉండదు. కానీ మహారాష్ట్రకు చెందిన వ్యాపారులు మాత్రం ఈ ఆదేశాలను బేఖాతరు చేస్తూ పాత తక్కెడ తూకాలను ఉపయోగిస్తున్నారు.

క్వింటాకు రూ.20 కిలోల వరకు మోసం

కౌతాళం, ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు, ఆలూరు, హొళగుంద మండలాల చుట్టుపక్కల గ్రామాలకు లారీలను తీసుకెళ్లి రైతుల ఇళ్ల వద్దనే పత్తిని కొనుగోలు చేస్తున్నారు. 10 క్వింటాళ్ల పత్తి పైబడి ఉన్న రైతుల వద్దకే వెళ్లి వారు కొనుగోలు చేస్తారు. తూకం వేసేటప్పుడు ఒకవైపు 50 కిలోల రాళ్ల, మరోవైపు పెద్ద సంచిని (డంప్ బ్యాగ్) వేలాడదీస్తారు. మోసపూరిత పద్ధతుల ద్వారా పత్తి తూకంలో క్వింటాకు 10 నుంచి 20 కిలోల వరకు మోసం చేస్తున్నట్లు తెలుస్తోంది. క్వింటా సగటు ధర రూ.7300 అనుకుంటే ఒక క్వింటా మోసానికి పది నుంచి 20 కేజీల వరకు నష్టం ఉంటుంది. మొత్తంమీద 10 క్వింటాళ్లకు అమ్మితే రెండు క్వింటాళ్ల వరకు నష్టం జరుగుతుంది. రైతుకు దాదాపు రూ.12 వేల నుంచి రూ.15 వేల వరకు నష్టం ఉంటుంది. ఈ వ్యాపారస్తులంతా మార్కెట్ యార్డు పరిధిలో కాకుండా నేరుగా రైతుల వద్ద కొనుగోలు చేసి రాత్రికి రాత్రే లారీల్లో పత్తిని మహారాష్ట్రకు తరలిస్తున్నారు. దీంతో మార్కెట్‌యార్డుకు చెల్లించాల్సిన సెస్సు (పన్ను) ప్రభుత్వానికి అందకుండా పోతోంది. రోజుకు సగటున 8 నుంచి 10 లారీల్లో పత్తి తరలిపోతుండగా ప్రభుత్వ ఖజానాకు రూ.లక్షల్లో గండి పడుతోంది. పది రోజుల నుంచి ఈ దోపిడీ ముమ్మరంగా జరుగుతున్నా మార్కెట్‌యార్డు అధికారులు, తూనికలు కొలతల శాఖ అధికారులు స్పందించడం లేదు.



తక్కెడ ద్వారా పత్తిని తూకం వేస్తున్న దృశ్యం

ఉరుకుంద క్షేత్రానికి పోటెత్తిన భక్తులు



భక్తులతో నిండిన ఆలయ ప్రాంగణం

కౌతాళం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అమావాస్య సందర్భంగా ఉరుకుంద క్షేత్రానికి గురువారం భక్తులు పోటెత్తారు. ఆలయ డిప్యూటీ కమిషనర్, ఈవో వాణి ఆలయంలో స్వామి వారికి అమావాస్య సందర్భంగా లక్ష పుష్పార్చన సేవలు కొనసాగించారు. కసాపురం ఆంజనేయస్వామి ఆలయ ఈవో విజయరాజు పాల్గొని స్వామి వారికి పుష్పార్చన నిర్వహించారు. అంతకు ముందు ఆలయ అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు వెండి , ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. తూర్పు రాజగోపురం నుంచి ఆలయ అధికారులు భక్తులకు స్వామి దర్శనం కల్పించారు. కొందరు భక్తులు స్వామి వారికి తలనీలాలు సమర్పించి పుణ్యస్నానాలు చేసి స్వామి వారిని దర్శించుకోగా మరి కొంత మంది భక్తులు ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక వంటకాలు చేసి స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. అన్నదాన సత్రంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.



కృష్ణానదిలో చేప పిల్లలను వదులుతున్న మత్స్యకారులు

మత్స్యకారులకు ఏదీ భరోసా?

పట్టించుకోని కూటమి ప్రభుత్వం

జూపాడుబంగ్లా, నవంబరు 20: శ్రీశైలం జలాశయంలో చేపలు పట్టుకొనే మత్స్యకారులకు భరోసా లేదు. గతంలో టీడీపీ హయంలో చేపలు పట్టుకునేవారికి వల, పుట్టితోపాటు తినడానికి బియ్యం అందించేవారు. మత్స్యకారుడు సొంతంగా చేపలు పట్టి అమ్ముకునేందుకు మోటారుసైకిలు కూడా రాయితీకి ఇచ్చేవారు. సహకార సొసైటీలకు రాయితీతో చేపల పిల్లలను చెరువుల్లో పెంచుకునేందుకు ఇచ్చేవారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మత్స్యకారులకు అందించే పథకాలన్నీ నిర్వీర్యమయ్యాయని అంటారు. కృష్ణానది పరివాహక రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలోని వేలాది మంది మత్స్యకారుల బతుకు భారమైంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని తుంగభద్ర, కృష్ణానదుల అనుసంధానంగా ఎన్నో జలాశయాల మీద ఆధారపడి వేలాదిమంది మత్స్యకారులు జీవనోపాధి పొందుతున్నారు. ప్రధానంగా కృష్ణానది పరివాహక ప్రాంతం పగిడ్యాల, నందికొట్కూరు, జూపాడుబంగ్లా, కొత్తపల్లి, పాములపాడు మండలాలతోపాటు దిగువ ఉన్న వెలుగోడు, గోరుకల్లు, అవుకు జలాశయాల్లో వేలాదిమంది మత్స్యకారులు జీవిస్తున్నారు.

చేపల నిల్వ.. మార్కెట్ లేక ఇబ్బందులు



పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ సమీపంలో చేపలను నిల్వ చేసుకునేందుకు 30 ఏళ్లకిందట ప్రభుత్వం ఐస్ ప్లాంటు ఏర్పాటు చేసింది. చేపలు చెడిపోకుండా మత్స్యకారులు ఐస్‌లో భద్రపరుచుకుని హైదరాబాదు, కలకత్తా, కర్నూలు తదితర ప్రాంతాలకు ఎగుమతి చేసుకుని లాభాలు గడించేవారు. ఆ ఐస్‌ప్లాంటు కూడా 2000 సంవత్సరం వరకు పనిచేసిన అధికారులు పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. అప్పటినుంచి మత్స్యకారులు ఐస్ కోసం వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. మత్స్యకారులకు సమీపంలో మార్కెట్ వ్యవస్థ కూడా లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. చేపలను నిల్వ ఉంచుకోలేక దళారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సివస్తోంది. అలాగే తంగడంచ విత్తనోత్పత్తి క్షేత్రంలో చేపపిల్లలను చేపపిల్లలను పెంచుకునేందుకు మత్స్యశాఖ అధికారులు సబ్సిడీపై అందించేవారు. ఇది కూడా క్రమంగా ఆగిపోయింది. మత్స్యశాఖ భూములు అన్యాక్రాంతమయ్యాయి.

నదిలో రుచికరమైన చేపలు

సముద్రంలో దొరికే చేపలకన్న కృష్ణానదిలో దొరికే చేపలకు మంచి డిమాండు ఉంది. బొత్స, రవ్వ, మోసు, జీలేబీ, కాకిపరక, బొమ్మడాయలు చేపలు రుచికరంగా ఉండటంతో డిమాండు బాగా ఉంటుంది. దొమ్మ చేప ఆయుర్వేదానికి ఉపయోగపడుంది. దీని రేటు ఇక్కడే కిలో రూ.300పైగా ఉంటుంది. మార్కెట్‌లో మరింత రేటు పలికే అవకాశం ఉంది.

వల విసిరితేనే జీవనోపాధి..



అవుకు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వల విసిరితేనే మత్సకారులకు జీవనోపాధి లభిస్తుంది. అవుకు పట్టణంలో 300 కుటుంబాలకు చెందిన మత్స్యకారులు చేపల వేటపై ఆధారపడి జీవిస్తున్నారు. రిజర్వాయర్‌లో చేపలను పట్టలేని సమయంలో కొందరు మత్స్యకారులు నీరు పారే కాలువల్లోకి వెళ్లి వల విసిరి చిన్న చిన్న చేపలను పడుతుంటారు. 4.148 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉన్న అవుకు రిజర్వాయర్‌లో చేపలు పెంచుతున్నారు. ఆగస్టు - సెప్టెంబరు నెలల్లో శ్రీశైలం నుంచి కృష్ణా జలాలు రిజర్వాయర్‌కు చేరిన తరువాత ప్రతి ఏటా కైకలూరు, భీమవరం నుంచి చేప పిల్లలను కొని నీటిలో వదులుతున్నారు. ఇందులో రోకు, బంగారుతీగ, గడ్డిచాప, మోస, కట్ల, జిలేబి ఆరు రకాల చేప పిల్లలు ఉంటాయి. చేప పిల్లల సైజును బట్టి రూ. 1 నుంచి 3 వరకు ధర ఉంటుంది. నవంబరు లేదా డిసెంబరు నెలల్లో 30 లక్షలు చేప పిల్లలను ప్రత్యేక వాహనాల్లో తీసుక వచ్చి రిజర్వాయర్‌లో వదలుతారు. ఈ చేప పిల్లలు 5నెలల కాలంలో 1కేజీ వరకు బరువు పెరుగుతాయి. పెరిగిన ఆడ చేపలు గుడ్లు పెట్టినప్పటికీ నీటిలోని జలచరాలు గుడ్లను తింటున్నాయి. దీని వల్ల చేపల సంతానోత్పత్తి పెరగడం లేదు. మత్స్యకారులు టన్ను చేపలు రూ. 1లక్షకు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. వీటిని వ్యాపారులు ఐస్‌బాక్స్‌లో ఉంచి తెలంగాణ, కర్ణాటక, తమిళనాడుకు తరలిస్తున్నారు.

సంగమేశ్వరంలో వలస మత్స్యకారులు



వెలుగోడు జలాశయం వద్ద చేపల విక్రయ కేంద్రంలోని దృశ్యం



ఆత్మకూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సప్తనదీ సంగమేశ్వరంలో కొన్నేళ్లుగా వైజాగ్, కాకినాడ తదితర ప్రాంతాలకు చెందిన మత్స్యకారులు వలస వచ్చి చేపల వేట సాగిస్తున్నారు. కృష్ణాతీరంలో చిన్నపాటి గుడారాలను ఏర్పాటు చేసుకుని ప్రతి రోజు చేపలవేటకు సిద్ధమవుతుంటారు. సంగమేశ్వరంలో ప్రతిఏటా 8నెలల పాటు నదీజలాలు ఉండటంతో ఇక్కడే తాత్కాలిక నివాసాలను ఏర్పాటు చేసుకుంటారు. నీటినిల్వలు తగ్గిన తర్వాత అక్కడి నుంచి తమ సొంత ప్రాంతాలకు వెళ్తుంటారు. కాగా తుంగభద్ర, కృష్ణా నదీ జలాల్లో కట్ల, రోహు, మృగల, బంగారుతీగ రకాల చేపలు ఎక్కువగా పెంచుతారు. ఇవే కాకుండా వివిధ రకాల చేపలు లభ్యమవుతున్నాయి. ప్రతిరోజు సాయంత్రం జలాల్లో వలలు వేసి ప్రాతఃకాల సమయం నుంచే వలల్లో చేపలతో చిక్కుకున్న వలల్ని సేకరించి చేపలను పడతారు. ఆయా ప్రాంతాల్లో లభించే చేపలు మంచి రుచిగా ఉండటంతో కలకత్తా, చెన్నై, హైద్రాబాద్, ఒంగోల్, కేరళ తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తారు. కృష్ణాతీరంలోని పలు గ్రామాల్లోని మత్స్యకారులు మార్కెటింగ్ సదుపాయం లేక దళారుల చేతుల్లో నష్టపోతున్నారు. ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తే ప్రయోజనం వుంటుందని మత్స్యకారులు చెబుతున్నారు. ఇదిలావుంటే సంగమేశ్వరంలో అలివి వలల వినియోగంతో మత్స్యసంపద వృద్ధికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి.

కనిపించని రాయితీ పథకాలు

గతంలో టీడీపీ ప్రభుత్వంలో మత్స్యకారుల కోసం పలు రాయితీ పథకాలు అందుబాటులో ఉండేవి. అయితే వైసీపీ అధికారంలోకి రాగానే అనేక పథకాలు ఈ పథకాలన్ని రద్దు చేయడం జరిగింది. కేవలం సముద్రాల్లో చేపలు పట్టే మత్స్యకారులకు మాత్రమే మత్స్యకార భరోసా కింద ప్రభుత్వం ఏటా రూ.10వేల వరకు సాయాన్ని అందించింది. అయితే జలాశయాల పరిధిలో జీవనం సాగించే మత్స్యకారులకు ప్రభుత్వ సాయం లేకపోవడంతో వారందరు తీవ్ర నిరాశకు లోనయ్యారు. మత్స్యశాఖ అధికారులు కూడా మత్స్యకారుల సంక్షేమానికి, మత్స్య సంపద అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకోవాలి



నదినే నమ్ముకొని జీవనం పోరాటం సాగిస్తున్న మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రత్యేక రాయితీ పథకాలను అమలు చేయాలి. గత వైసీపీ పాలనలో కేవలం సముద్రాల్లో చేపలు పట్టే మత్స్యకారులకు మాత్రమే మత్స్యకారుల భరోసా పథకం ద్వారా ప్రతిఏటా రూ.10వేల వరకు సాయం అందించారు. నదుల్లో, జలాశయాల్లో చేపలు వేట సాగించే తమలాంటి మత్స్యకారులకు ఎలాంటి సాయం అందలేదు. కూటమి ప్రభుత్వమైనా మత్స్యకారుల సంక్షేమానికి అండగా నిలవాలి. మత్స్య సంపదకు మంచి మార్కెటింగ్ ఉండేలా చొరవ తీసుకుంటే తమ జీవితాలు బాగుపడే అవకాశం ఉంది.

- రమణయ్య, సంగమేశ్వరం, కొత్తపల్లి మండలం

మత్స్యకారుల దినోత్సవం



వెలుగోడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : వెలుగోడు మండలంలో సుమారు 17 టీఎంసీల సామర్థ్యం గల జలాశయం ఉంది. ఈ జలాశయంలో ప్రతిఏటా సుమారు 20 నుండి 30 లక్షల వరకు చేప పిల్లలను విడుదల చేస్తారు.. ఈ చేపల పెంపకంతో మత్స్యకారులకు జీవనోపాధి కలుగుతుంది. జలాశయంలో ప్రతి ఏటా కట్ల, రోహు, ఎర్ర, తెల్లమోసు, కాకి, వాల్గ, తదితర జాతులకు చెందిన చేపలను పెంచుతారు. ఈ చేపలు ఆరకేజి నుండి సుమారు15 కేజీల వరకు బరువు పెరుగుతాయి. ఈ జలాశయం చేపల పెంపకంతో ఆరువందల మంది మత్స్యకారులు లైసెన్సులు పొంది చేపలు పడుతున్నారు. ఈ చేపలను వెలుగోడు నుండి హైదరాబాద్, చెన్నై, కలకత్తా నగరాలకు కూడా మత్స్యకారులు సరఫరా చేస్తారు.

వెలుగోడు జలాశయంలో పట్టిన చేపలు

ఏటా 23 ఎకరాల్లో చేపలను పెంచుతున్నాం



నంద్యాల మండలం అయ్యలూరు గ్రామ సమీపంలో 23 ఎకరాలను మేము లీజుకు తీసుకుని చేపలను పెంచుతున్నాము. చేపల ఉత్పత్తికి మంచి ఆహారం అవసరం ఉంది. కాని అధిక ధరల వల్ల నష్టం వాటిల్లుతోంది. 10 టన్నుల చేపల ఉత్పత్తికి రూ.6లక్షల పెట్టుబడి వస్తోంది. పెట్టుబడి పోను ఆదాయం అంతంత మాత్రమే ఉండడంతో చేపల పెంపకంపై రైతులు దృష్టి సారించడం లేదు. ప్రైవేట్‌గా సాగుచేస్తున్న రైతులకు కూడా ప్రభుత్వ మత్స్యశాఖ నుంచి ఆదరణ లభిస్తే రైతుకు భయం ఉండదు. మేము రూప్‌చంద్ రకం చేపలను ఉత్పత్తి చేస్తున్నాం.

- గోపాలకృష్ణ, మత్స్యకారుడు, నంద్యాల



నంద్యాల ప్రాంతంలో సాగవుతున్న రూప్‌చంద్ రకం చేపలు

మత్స్య సంపద దేశార్థిక ప్రగతికి వెన్నుదన్ను



రాష్ట్రంలో ఇతర జిల్లాలతో పోలిస్తే కర్నూలు జిల్లాలో చేపల పెంపకం అతి తక్కువగా ఉంది. ప్రధాన కారణం జల వనరులు లేకపోవడమే. జిల్లాలో ఈ ఏడాది 37,981 టన్నులు చేపలు, 116 టన్నులు రొయ్యలు ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటి వరకు 16,635 టన్నులు చేపలు, 21 టన్నుల రొయ్యలు ఉత్పత్తి చేశాం. జిల్లా జీవీఏ లక్ష్యం రూ.723 కోట్లు. మత్స్య శాఖ ఫిష్ సీడ్ ఫారాల్లో 70 లక్షల చేప పిల్లలు పెంపకం చేపట్టాం. వివిధ కారణాలు వల్ల పెంపకం దశలోనే కొంత కోల్పోవాల్సి వస్తుంది. శ్రీశైలం జలాశయంలో 51.50 లక్షలు, సుంకేసుల జలాశయంలో 3.50 లక్షల చేప పిల్లలు వదిలేందుకు సన్నహాలు చేస్తున్నాం. మన చెరువు - మన సీడ్ పథకం కింద గాజులదిన్నె సొసైటీ కోటి, గూడూరు సొసైటీ 60 లక్షలు, సుంకేసుల సొసైటీ ఆధ్వర్యంలో 50 లక్షల చేప గుడ్డు పిల్లలు తెచ్చి పెంచుతున్నాం. నేడు అంతర్జాతీయ మత్స్య దినోత్సవం పురస్కరించుకొని గాజులదిన్నె జలాశయంలో చేప పిల్లలు వదులుతాం. తగిన జాగ్రత్తలతో చేపల పెంపకం చేపడితే లాభదాయంగా ఉంటుంది. ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

- రంగనాథ్ బాబు, డీడీ, మత్స్య శాఖ, కర్నూలు

కనీస సౌకర్యాలు మృగ్యం

కర్నూలు జిల్లాలోని గాజులదిన్నె, పందికోన, కృష్ణగిరి, పులికనుమ జలాశయాల్లో చేపల పట్టేందుకు లీజుదారులు మత్స్యకారులను ఉత్తరాంధ్ర, కోస్తా ప్రాంతాల నుంచే కా కుండా తమిళనాడు నుంచి తీసుకొస్తున్నారు. జలశయాల ఒ డ్డునే చిన్నపాటి గుడారాలు వేసుకొని వేట సాగిస్తున్నారు. అయితే.. కనీస సౌకర్యాలు ఉండడం లేదు. వారికి లైసెన్సు కూడా ఉండదు. దీంతో ప్రమాదాలకు గురైతే మత్స్యకారులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. సంబంధిత శాఖ అధి కారులు ఇతర ప్రాంతాల నుంచి చేపలు పట్టేందుకు వచ్చే మత్స్యకారులకు స్థానికంగా లైసెన్సులు ఇవ్వడంతో పా టు వారి సంక్షేమానికి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మార్కెట్ వ్యవస్థ లేదు



కూరగాయలు అమ్ముకోవడానికి రైతులకు రైతుబజార్లు ఉన్నాయి కానీ మత్స్యకారులకు మార్కెట్ వ్యవస్థలేదు. దీంతో తీవ్రంగా నష్టపోతున్నాం. శ్రీశైలం జలాశయంలో పట్టుకున్న చేపలను భద్రపరుచుకునేందుకు ఐస్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. గతంలో పోతిరెడ్డిపాడు వద్ద ఉండిన ఐస్ ప్లాంటును అధికారులు పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. దాన్ని అధికారులు ఉపయోగంలోకి తీసుకొస్తే బాగుంటుంది.

- సుధాకర్, మత్స్యకారుడు, చాబోలు గ్రామం, జూపాడుబంగ్లా మండలం

ప్రభుత్వం ఆదుకోవాలి



కృష్ణానదిలో ప్రాణాలను పణంగా పెట్టి చేపలు పట్టుకుని జీవిస్తున్నాం. అయినా బతుకుతెరువు కష్టంగా ఉంది. గతంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి ఉన్న సమయంలో మత్స్యకారులను సబ్సిడీలపై మోటారుసైకిల్లు, ఉచితంగా వలలు ఇచ్చారు. ఇప్పుడు కూడా ఇస్తే బాగుంటుంది.

- సురేష్, మత్స్యకారుడు, చాబోలు గ్రామం

కృష్ణమ్మ ఒడిలో చేపల వేట

నందికొట్కూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు నియోజకవర్గంలోని మత్స్యకారులు కృష్ణానది మీద ఆధారపడి జీవిస్తున్నారు. ఉన్నాయి. జనవరి నుంచి జూలై, ఆగస్టు నెలల వరకు జాలర్లు నదిపై ఆధారపడి ఉన్నారు. నందికొట్కూరు నియోజకవర్గంలోని నందికొట్కూరు, పగిడ్యాల, జూపాడుబంగ్లా, కొత్తపల్లి మండలాల్లోని శాతనకోట, మల్యాల, నెహ్రూనగర్, ముచ్చుమర్రి, పోతులపాడు, సంగమేశ్వరం, జానాలగూడెం, బలపాలతిప్ప, ఇలా పాతాళగంగ వరకు 100 కి.మీటర్లకు పైగానే కృష్ణా నదిలో చేపల వేట కొనసాగుతోంది. నవంబరు నుంచి కృష్ణానదిలోని నీరు తగ్గుతూ వస్తోంది. ఈ సమయంలో మత్స్యకారులు చేపలు పట్టడం మొదలవుతుంది. ఇలా పట్టిన చేపలను హైదరాబాదు, బెంగళూరులకు తరలిస్తారు.

- సాధారణంగా కృష్ణానదిలో బేర్షలు, బట్టగెండె, పొట్టు, మోసు, నారజల, బొచ్చ, బంగారు తీగ, వివిధ రకాల చేపలు లభిస్తాయి. జూన్‌నెలలో అధికారులు చేప పిల్లలను కూడా నదిలో వదులుతారు. ఈ నదిలో జూన్, జూలై నెలల్లో సుమారు 5 నుంచి 10 కేజీలు ఉండే చేపలు లభిస్తాయి.




వన్య ప్రాణులను వేటాడితే జైలుకే

- ఏడేళ్లు జైలుశిక్ష, జరిమానా
- ముర్తుజావలి, ఫారెస్టు రేంజర్

రుద్రవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నల్లమల జీవ వైవిధ్యంలో వన్యప్రాణులు ఒక భాగం. మానవుల మనుగడలో అడవులు, వన్యప్రాణులు ముఖ్యం. ప్రకృతి వైపరీత్యాలను వన్యప్రాణులు ముందే పసిగడతాయి. రుద్రవరం ఫారెస్టు రేంజ్ 42113.97 హెక్టార్లలో విస్తరించి ఉంది. ఐదు సెక్షన్లు, 14 బీట్‌లు ఉన్నాయి. నల్లమలలోని వన్యప్రాణుల సంరక్షణకు అధికారులు గ్రామసభలు నిర్వహిస్తున్నారు. దండోరా వేసి ప్రజలను చైతన్యపరుస్తున్నారు.

వన్యప్రాణులు ఇలా

వన్యప్రాణులు షెడ్యూలు-1లో పెద్ద పులి, చిరుతపులి, క్రిష్ణ జింక, అడవి జింక, నెమలివంటివి వర్తిస్తాయి. వీటిని వేటాడితే ఏడు సంవత్సరాలు జైలుశిక్ష, రూ.లక్ష నుంచి 50 లక్షల వరకు జరిమానా ఉంటుంది.



నల్లమల అడవులు

షెడ్యూలు 2 ఇలా

కణితి, ఎలుగుబంటి, మోసుడిలి, అడవి పంది, కొండె గొర్రె, జింకారా వన్యప్రాణులు షెడ్యూలు-2లో వర్తిస్తాయి. వీటిని వేటాడితే 3 సంవత్సరాల నుండి ఆపై జైలు శిక్షకు అర్హులవుతారు.

8 నెలల్లో నాలుగు కేసులు నమోదు

రుద్రవరం ఫారెస్టు రేంజ్‌లో 2025 ఏప్రిల్ 6న, జూన్ 29న అడవి పందులను వేటాడిన వారిని కేసు నమోదు చేశారు. 2025 జూలై 27న అహోబిళంలో నాటు తుపాకీ స్వాధీనం చేసుకున్నారు. 2025 నవంబరు 15న అడవి పంది వేటలో నలుగురిపై కేసు నమోదు చేశారు. వీరిలో ఇద్దరిని అరెస్టు చేశారు. ధర్మారెడ్డి, నాగేశ్వర్‌రావు అనే వారు పరారీలో ఉన్నారు.

వన్య ప్రాణులను సంరక్షిస్తాం



వన్యప్రాణుల సంరక్షణకోసం ప్రజలను చైతన్యపరుస్తున్నాం. ఏప్రిల్ నుంచి నవంబరు వరకు వన్య ప్రాణి చట్టం 1972 కింద నాలుగు కేసులు నమోదు చేశాం. వన్యప్రాణులను వేటాడినా, వాటి చర్మం, గోళ్లు విక్రయించినా జైలుకు వెళతారని ప్రచారం చేస్తున్నాం.

- ముర్తుజావలి, డిప్యూటీ రేంజర్



వన్యప్రాణి సంరక్షణపై అవగాహ కల్పిస్తున్న దృశ్యం

పైపులైన్ నిర్మాణానికి రైతులు సహకరించాలి

- జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్



హూడిచెర్లలో పైపులైన్ స్థలాన్ని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్

ఓర్వకల్లు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌కు తీసుకెళ్తున్న పైపులైన్ నిర్మాణానికి రైతులు సహకరించాలని జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ కోరారు. గురువారం మండలంలోని హూడిచెర్ల గ్రామ సమీపాన వెళ్తున్న పైపులైన్ భూములను ఆయనతో పాటు ఆర్డీవో సందీప్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు జేసీతో మాట్లాడుతూ ఎత్తిపోతల పథకం నుంచి గార్గేయపురం, కేతవరం, హూడిచెర్ల వరకు పైపులైన్ పూర్తయిందని, హూడిచెర్ల వద్ద సారవంతమైన భూములు రైతులు కోల్పోవాల్సి వస్తుందని హూడిచెర్ల గ్రామ మైనార్టీ కాలనీ నుంచి కొండపై చెరువు కట్ట వరకు పైపులైన్ తీసుకెళితే రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని జేసీకి రైతులు తెల్పి చెప్పారు. అయితే.. కొండపై నీరు ఎక్కేందుకు ఇబ్బందిగా ఉంటుందని, గతంలో వేసిన ప్రకారమే పైపులైన్ వేస్తామని అధికారులు తేల్చి చెప్పారు. పైపులైన్ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు రూ.12.50 లక్షలు మంజూరు చేశామని, అయితే.. రైతులు నష్టపరిహారాన్ని తిరస్కరిస్తున్నారనీ తెలిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వో, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఏపీఐఐసీలో భూములు కోల్పోయిన బ్రాహ్మణపల్లె, కన్నమడకల, హూడిచెర్ల, ఓర్వకల్లు, గుట్టపాడు, ఎన్. కొంతలపాడు, మీదివేముల, ఉప్పలపాడు, సోమయాజులపల్లె, పాలకొలను, కొమరోలు గ్రామాల్లో భూములు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిలో ఈ నెల 27లోపు పూర్తి చేయాలని జేసీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విద్యాసాగర్, డిటీ సతీష్ కుమార్, సర్వేయర్ శంకర్ మాణిక్యం, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

సివిల్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తులు

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సివిల్స్ సర్వీసెస్ ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలకు ఉచిత శిక్షణకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి సురేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వాసులై ఉండి డిగ్రీ పూర్తి చేసిన ఎస్టీ కులానికి చెందిన వారు అర్హులు అన్నారు. ఆసక్తి గలిగిన అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు రెండు ఫోటోలు, విద్య, కుల, ఆదాయ ధృవీకరణ పత్రం, ఆధార్, పాన్‌కార్డు తదితర జిరాక్స్ కాపీలను జతపరిచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను సమర్పించాలన్నారు. గిరిజన విద్యార్థులకు విజయవాడలో 40, తిరుపతిలో 40, విశాఖపట్టణం 20 కేంద్రాల్లో కలిపి మొత్తం 100 సీట్లు కేటాయించినట్లు తెలిపారు. కుటుంబ సంవత్సర ఆదాయం రూ.8లక్షల లోపు ఉండాలన్నారు. రెగ్యులర్ డిగ్రీ అర్హత తప్పనిసరి అన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులను సమర్పించేందుకు ఈ నెల 26వ తేదీ చివరి గడువు అన్నారు. ఈ నెల 27 నుంచి హాల్ టికెట్లను డౌన్ లోడు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 30న దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్క్రీనింగ్ పరీక్షలో ఎంపికైన అభ్యర్థులకు డిసెంబరు 10వ తేదీ నుంచి శిక్షణ తరగతులు ప్రారంభం అవుతాయని సురేష్ పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన గిరిజన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా తెగల షెడ్యూల్ సంక్షేమ సాధికారిత అధికారి సురేష్ తెలిపారు.

23న అండర్-12 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక

కర్నూలు న్యూసిటీ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్వర్యంలో జరిగే సౌత్ జోన్ అంతర్ జిల్లా క్రికెట్ టోర్నమెంటులో పాల్గొనే అండర్-12 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక ఈనెల 23న నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి దేవేందర్‌గౌడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు డీఎస్ఏ స్టేడియంలోని కర్నూలు క్రికెట్ అసోసియేషన్ నెట్స్‌లో ఎంపిక జరుగుతుందన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు పాల్గొనాలని ఆయన కోరారు. 1-9-2013 తరువాత జన్మించిన వారు ఎంపికకు అర్హులన్నారు. ఒరిజినల్ జనన ధృవీకరణ పత్రాలు, ఆధార్ కార్డుతో ఎంపికకు రావాలన్నారు.

సచివాలయ పర్యవేక్షణ అధికారుల నియామకం

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సచివాలయాలకు పర్యవేక్షణ అధికారులను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. వీరికి డిప్యూటీ ఎంపీడీవో స్కేల్‌ను కేటాయిస్తూ డిప్యుటేషన్‌పై పని చేయనున్నారు. ఈ మేరకు గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులు, సీనియర్ అసిస్టెంట్లు కర్నూలు జిల్లాలో 25 మంది, నంద్యాల జిల్లాలో 28 మంది లబ్ధి పొందనున్నారు. మండల స్థాయిలోనే వీరు విధులు నిర్వహించాల్సి ఉంటుంది. కాగా వీరిని మండల జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారిగా పరిగణిస్తారు.

అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

కర్నూలు రూరల్ నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో అప్రెంటిషిప్ చేసేందుకు దరఖాస్తు చేసుకున్న ఐటీఐ అభ్యర్థులకు వచ్చే నెల 5వ తేదీన సర్టిఫికెట్లు పరిశీలన చేయనున్నట్లు ఏపీఎస్ఆర్టీసీ కర్నూలు జోనల్ సిబ్బంది కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. నజీర్ అహమ్మద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 25నుంచి ఈనెల 8వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మాత్రమే సర్టిఫికెట్ల పరిశీలనకు రావాలని ఆయన సూచించారు. అభ్యర్థులు ఒరిజనల్ సర్టిఫికెట్లతోపాటు ఆధార్ కార్డు, పాస్ ఫొటోలు, కుల, ఆదాయ సర్టిఫికెట్లు కూడ వెంట తెచ్చుకోవాలని వివరించారు. ఐటీఐలో డిజిల్ మెకానిక్ ట్రేడ్ అభ్యర్థులకు వచ్చే నెల 5వ తేదీన ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందన్నారు.

భవనాశి నీటిలో జారిపడి రైతు మృతి

చాగలమర్రి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నగల్లపాడు గ్రామ సమీపంలోగల భవనాశి నీటిలో ప్రమాదవశాత్తు జారిపడి రైతు మూరబోయిన రామసుబ్బయ్య (60) గురువారం రాత్రి మృతి చెందాడు. మృతుడు తనకున్న గేదెలను మేపుకునేందుకు పొలానికి వెళ్లాడు. తిరిగి గేదెలను ఇంటికి తీసుకొస్తుం డగా భవనాశి నీటిలోకి గేదెలు దిగడంతో వాటిని తోలేందుకు వెళ్లి నీటి గుంతలో ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. గేదెలు ఇంటికి వచ్చిన రామసుబ్బయ్య రాకపోవడంతో భార్య, కుటుంబీకులు భవనాశి వద్ద ప్రవహిస్తున్న నీటి వద్దకు వెళ్లి గాలింపు చేశారు. కనిపించక పోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎస్‌ఐ సురేష్, పోలీసులు భవనాశి నది వద్దకు వెళ్లి నీటిలో గాలింపు చేయగా మృతదేహం బయటపడింది. నీటిలో ఉన్న మృతదేహాన్ని బయటకు తీశారు. గేదెలు మేపుకునేందుకు వెళ్లి మృత్యువాత పడటంతో భార్య, కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆళ్లగడ్డ వైద్యశాలకు తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


రామసుబ్బయ్య(ఫైల్)

చికిత్స పొందుతూ ఆటో డ్రైవర్ మృతి

కర్నూలు క్రైం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదానికి గురైన జయకృష్ణ అనే యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతి చెందాడు. శివరాంపురం గ్రామానికి చెందిన జయకృష్ణ ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 18న తన మిత్రుడ్ని గార్గేయపురం వెళ్లి వదిలి తిరిగి వెళ్తుండగా.. ఆటో బోల్తా పడి గాయాలయ్యాయి. గాయపడిన జయకృష్ణను చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేర్పించగా కోలుకోలేక మృతి చెందాడు. తాలుకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య

కోవెలకుంట్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎల్‌యం కాంపౌడుకు చెందిన రంగస్వామి(21) అనే యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. పట్టణంలోని ఎల్‌యం కాంపౌడుకు చెందిన రామారావు కుమారుడు రంగస్వామి గడేకారి పనిచేస్తూ జీవనం సాగించేవాడు. గురువారం పనికి వెళ్లి ఇంటికి వచ్చి ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి ఉరి వేసుకున్నాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వెలుగోడులో చోరీ

వెలుగోడు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీనగర్‌లో గురువారం తెల్లవారుఝామున భారీ చోరీ జరిగింది. కాలనీకి చెందిన సిద్ధయ్య క్రాంతి నగర్‌లో నివసిస్తున్నాడు.. ఆయన వెలుగోడులోని పొట్టి శ్రీరాములు సెంటర్‌లో పానీపూరి వ్యాపారం చేస్తున్నాడు. ఆయన ఇంటి నుంచి వ్యాపారానికి వెళ్లిన సమయంలో దొంగలు ఇంట్లోకి ప్రవేశించి ఇంటిలోని బీరువాను పగులగొట్టి రూ.60 వేలు నగదు.. 24 గ్రాముల బంగారం, ఒక సెల్‌ఫోన్ దొంగిలించినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేశారు. క్లూస్ టీమ్‌ను రప్పించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేశ్ తెలిపారు.

బాలికను వేధించిన వ్యక్తిపై కేసు

శ్రీశైలం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థానంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న వ్యక్తిపై పోలీసులు వేధింపుల కేసు నమోదు చేశారు. శ్రీశైలం 1వ పట్టణ సీఐ ప్రసాదరావు తెలిపిన వివరాలివీ.. మేకలబండకు చెందిన బాలికను కొంత కాలంగా రాజు ప్రకాష్ రెడ్డి లైంగికంగా వేధిస్తున్నాడని బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. విచారించి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

జిల్లా జైలు తనిఖీ

కర్నూలు లీగల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచలింగాలలోని జిల్లా జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన జైలులో నిర్వహిస్తున్న లీగల్ ఎయిడ్ క్లీనిక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ లీగల్ ఎయిడ్ క్లీనిక్‌లో ఒక న్యాయవాదితో పాటు పారా లీగల్ వలంటీర్ సభ్యులుగా ఉంటారనీ, వారు ఖైదీలకు ఉచిత న్యాయ సహాయాన్ని అందిస్తారనీ తెలిపారు. జైలులో ఉన్న ఖైదీలు సత్ప్రవర్తనతో తమ శిక్షా కాలాన్ని పూర్తి చేసుకోవాలని సూచించారు. ఖైదీలకు అవసరమైన న్యాయ సహాయాన్ని తాము ఉచితంగా అందజేస్తామని, అనారోగ్యం, 70 ఏళ్ల వయస్సు దాటిన ఖైదీలకు బెయిల్ మంజూరయ్యేందుకు తాము కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జైలు అధికారులు లీగల్ ఎయిడ్ న్యాయవాది శివరాం తదితరులు పాల్గొన్నారు.


భోజనం రుచి చూస్తున్న లీలా వెంకట శేషాద్రి

మమతా నగర్‌లో చోరీ

కర్నూలు క్రైం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలో మమతా నగర్‌లో మునిస్వామి అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగింది. మునిస్వామి ఈ నెల 17వ తేదీన కుటుంబ సభ్యులతో కలిసి ఊరు వెళ్లాడు. తిరిగి వచ్చి చూస్తే ఇంట్లో ఉన్న తులం బంగారు ఆభరణాలు, రూ.40వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. తాలుకా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హెడ్ కానిస్టేబుళ్లకు పదోన్నతి

కర్నూలు క్రైం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నలుగురు హెడ్ కానిస్టేబుళ్లకు ఏఎస్‌ఐలుగా పదోన్నతి కల్పిస్తూ డీఐజీ కోయ ప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు. సి.నాగన్న (జూపాడుబంగ్లా పీఎస్), హనీఫ్ (కే.నాగులాపురం పీఎస్), మద్దిలేటి (కర్నూలు త్రీటౌన్ పీఎస్), మీరాసాహేబ్(కోవెలకుంట్ల పీఎస్) పదోన్నతి పొందిన వారిలో ఉన్నారు.

సమగ్ర శిక్ష ప్రాజెక్టు కో ఆర్డినేటర్‌గా డాక్టర్ ఎన్‌వీ లోక్‌రాజ్

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్‌గా డాక్టర్ ఎన్‌వీ లోక్‌రాజ్‌ను నియమిస్తూ ప్రభుత్వ కార్యదర్శి శశిధర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. డోన్ జీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లెక్చరర్‌గా పని చేస్తున్న ఎన్‌వీ లోక్‌రాజ్‌ను డిప్యుటేషన్‌పై నియమించారు. ప్రస్తుతం డీఈవో శామ్యూల్ పాల్ ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్నారు.

మట్టి టిప్పర్ సీజ్

మహానంది, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): నల్లమల అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్‌ను మైనింగ్ శాఖ అధికారులు సీజ్ చేశారు. అడవిలోని సర్వనరసింహస్వామి ఆలయం సమీపంలో ఉన్న వాగులో నుంచి రైల్వే డబల్ ట్రాక్ అభివృద్ధి పనుల కోసం గురువారం కొందరు కాంట్రాక్టర్లు ఎక్స్‌కవేటర్ సాయంతో తవ్వి టిప్పర్‌తో అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం అందింది. మహానంది మండలం బోయలకుంట్ల మెట్ట వద్ద టిప్పర్‌ను స్వాధీనం చేసుకొన్నారు. టిప్పర్‌ను మహానంది పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

పరిశ్రమల స్థాపనకు అనుమతులు

• కలెక్టర్ సిరి

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల స్థాపనకు వీలుగా ఆయా శాఖలు నిర్దేశించిన గడువులోపు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ ఎక్స్‌పర్ట్ ప్రమోషన్ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా వచ్చిన దరఖాస్తులకు గడువులోపు అనుమతులను మంజూరు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం కింద లబ్ధిదారులను త్వరితగతిన రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎల్డీఎంను ఆదేశించారు.



● 9.72 లక్షలకు ఆమోదం: పరిశ్రమలకు ప్రోత్సాహకాల్లో బాగంగా క్లయిమ్‌లకు రూ.9.72 లక్షలకు ఆమోదం తెలిపామని కలెక్టర్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా పెట్టుబడి రాయితీ కింద ఒక క్లైయిమ్‌కు రూ.5,29,398, పవర్ కాస్ట్ రియంబర్స్‌మెంటు కింద ఒక క్లయిమ్‌కు రూ.66,257, సేల్స్ ట్యాక్స్ రీయంబర్స్‌మెంటు కింద ఒక క్లైయిమ్‌కు రూ.3,77,186, పారిశ్రామిక ప్రోత్సాహకాల కింద ఆమోదం తెలిపామన్నారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం అశోక్ కుమార్, పరిశ్రమల శాఖ డీడీ జవహర్‌బాబు, మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

తలసేమియా బాధితుల కోసం...

• రక్తదానం చేసిన హీరో మంచు మనోజ్


రక్తదానం చేస్తున్న హీరో మంచు మనోజ్


సమావేశంలో మాట్లాడుతున్న మంచు మనోజ్

కర్నూలు హాస్పిటల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి ముందుకు రావాలని సినీ నటుడు మంచు మనోజ్ పిలుపునిచ్చారు. నందమూరి బాలకృష్ణ, మోక్షజ్ఞ ఆర్గనైజేషన్ కర్నూలు ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్‌లో తలసేమియా చిన్నారుల కోసం మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సిని నటుడు మంచు మనోజ్, ఆయన భార్య భూమా మౌనిక పాల్గొన్నారు. ఈ సందర్భంగా తలసేమియా బాధితుల కోసం మంచు మనోజ్ రక్తదానం చేశారు. అనంతరం రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్మన్ డాక్టర్ కేజీ గోవిందరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంచు మనోజ్ మాట్లాడారు. తలసేమియాతో బాధపడుతున్న చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఈ రక్తదాన శిబిరంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. తలసేమియా వ్యాధిని తెలుసుకునేందుకు గర్భిణులు, జన్యుపరీక్షలు చేయించుకోవాలన్నారు. ఇలాంటి కార్యక్రమాన్ని నందమూరి బాలకృష్ణ అభిమానులు, మోక్షజ్ఞ ఆర్గనైజేషన్ మరిన్ని నిర్వహించాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని అవగాహన కల్పించేలా పోస్టర్లను ఆవిష్కరించారు. రక్తదాన శిబిరంలో 85 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ ఛైర్మన్ కె.అరుణ, కోశాధికారి నరసింహ, కమిటీ సభ్యులు జి.శ్రీనివాసులు యాదవ్, కేవీ సుబ్బారెడ్డి, భీమా శంకర్ రెడ్డి, మోక్షజ్ఞ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు ఎస్.మోతిలాల్, కన్వీనర్ రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిరప పంటకు గడ్డి మందు పిచికారీ

• రూ.10 లక్షల పంట నష్టం • ఇద్దరిపై కేసు నమోదు

మంత్రాలయం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మిరప పంట బాగా దిగుబడి వచ్చిందనన్న కక్షతో తమ్ముడి మిరప పంటకు గడ్డి మందు కొట్టి అన్న, అన్న కొడుకులు నాశనం చేశాడు. మంత్రాలయం మండలంలోని సూగూరు గ్రామానికి చెందిన పింజరి మాబు సాబ్, దస్తగిరమ్మకు రెండెకరాల పొలం ఉంది. ఒక ఎకరాలో పత్తి వేయగా.. మరో ఎకర పచ్చి మిరప 2043 గాడిగరకం మిర్చి పంటను సాగు చేశాడు. అయితే.. పంట గ్రామంలోనే అధిక దిగుబడి రావడం చూసి ఓర్వలేక అన్న అబ్దుల్, కుమారుడు రెహిమాన్ రాత్రికిరాత్రి గడ్డి మందు పిచికారీ చేశారు. దంతో పంట ఎండిపోయి మిరపకాయలు రాలిపోయి మచ్చలు ఏర్పడ్డాయి. ఈనెల 12న పిచికారీ చేయగా.. 13వ తేదీ మధ్యాహ్నం నాటికి మిరప పంట మచ్చలు సోకి ఎండిపోయింది. ఇది గమనించిన రైతు పిచికారీ మందు యజమానికి సమాచారం ఇచ్చారు. కంపెనీ అధికారులు పొలాన్ని చూసి అదే మందును కురువ మహదేవ, జూట వీరనాగుడు, బూదూరు గ్రామంలో పిచికారీ చేశారు. తన పక్క పొలంలోనే ఉన్న అన్న కొడుకు ఈ పని చేశారని గుర్తించి గురువారం మంత్రాలయం పోలీస్‌స్టేషన్‌లో బాధిత రైతు దంపతులు ఫిర్యాదు చేశారు. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అన్న పింజరి అబ్దుల్, రెహిమాన్‌పై కేసు దర్యాప్తు చేస్తున్నారు. చేతికొచ్చిన పంటను ఓర్వలేక సొంత అనే రూ.10 లక్షల పంటను నాశనం చేయడం.. తమ్ముడు జీర్ణించుకోలేకపోయాడు. దాదాపు రూ.5 లక్షలు అపులు చేసి ఈ ఏడాదైనా అప్పులు తీరుతాయనుకుంటే అన్నే తమ్మునికి ఇంత నష్టం కలిగించడం చర్చనీయాంశంగ మారింది.


ఎండిపోయిన మిరప పంటను చూపిస్తున్న రైతు దంపతులు

ప్రాణం పోసిన వైద్యులు

• కర్నూలు జీజీహెచ్‌లో అరుదైన ఆపరేషన్


రోగితో డాక్టర్ మంజులాబాయి, వైద్యులు

కర్నూలు హాస్పిటల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా కదిరికి చెందిన ఓ రోగికి కర్నూలు జీజీహెచ్ ప్లాస్టిక్ సర్జరీ వైద్యులు ప్రాణం పోశారు. కదిరికి చెందిన 54 ఏళ్ల ఏసన్న గుండెలో మూడు వాల్వ్‌లు బ్లాక్ కావడంతో సెప్టెంబరులో అనంతపురంలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చేరారు. వైద్యులు ఓపెన్ హార్ట్ సర్జరీ చేశారు. ఇంటికి వచ్చిన తర్వాత కుట్లు వేసిన చోట రక్తం, చీము కారడంతో మళ్లీ ఆపరేషన్ చేయించుకున్న ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లగా బెంగుళూరుకు రెఫర్ చేశారు. బెంగుళూరులోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో అడ్మిట్ కాగా రూ.10 లక్షలు ఖర్చు అయింది. అయిన ఇన్‌ఫెక్షన్ తగ్గకపోవడం ఓ వైద్యుని సూచనల మేరకు గత నెల 29వ తేదీన రోగిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలోని ప్లాస్టిక్ సర్జరీ విభాగానికి తీసుకుని వచ్చారు. హెచ్‌వోడీ డా.మంజులాబాయి రోగిని పరీక్షించి అడ్మిషన్ చేసుకుని ఈ కేసును చాలెంజ్‌గా తీసుకున్నారు. ఈ నెల 8వ తేదీన ప్లాస్టిక్ సర్జరీ హెచ్‌వోడీ డా.మంజులాబాయి అసోసియేట్ ప్రొఫెసర్ డా.గంగాభావని, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా.సింధూ ప్రియాంక, డా.విజయ చంద్రమౌళి బృంధం క్లిష్టమైన కేసును విజయవంతంగా నిర్వహించారు. వారం రోజులకు ఇన్‌ఫెక్షన్ తగ్గడంతో డిశ్చార్జ్ అయ్యారు. గురువారం సర్జరీ వివరాలను డా. మంజులాబాయి వివరించారు.

రైతులకు నోటీసులు

మహానంది, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపవరం గ్రామానికి చెందిన ఆరుగురు రైతులకు నోటీసులు అందచేసినట్లు ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. మహానంది నుం,ఇ ఎంసీ ఫారం మీదుగా గాజులపల్లికి వెళ్లే మార్గంలోని ప్రధాన రహదారిపై గోపవరానికి చెందిన ఆరుగురు రైతులు మొక్కజొన్న సీడ్‌ను ఆరబెట్టుకోవడం వల్ల తరుచూ వాహనాదారులు ప్రమాదానికి గురవుతున్నట్లు ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. ఇందులో భాగంగా ఆరబోసిన మొక్కజొన్న పంటను తొలగించాలని నోటీసులు ఇచ్చినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైకు చోరీ

మహానంది, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుక్కాపురం గ్రామంలో బైక్ చోరీకి గురైనట్లు బాధితుడు నల్లబోతుల శ్రీనివాసులు బుధవారం తెలిపారు. మంగళవారం రాత్రి ఇంటిముందు ఉంచి ఉన్న బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

రైతుల ప్రయోజనమే లక్ష్యం

• రీజనల్ మేనేజర్ నాగరాజు


గోదాము వద్ద కాటాను పరిశీలిస్తున్న ఆర్ఎం

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గిడ్డంగుల సంస్థ (ఎస్‌డబ్ల్యూసీ)ను బలోపేతం చేయడంతో పాటు రైతులకు ప్రయోజనం కల్పించడమే లక్ష్యంగా కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని ఆ సంస్థ రీజనల్ మేనేజర్ నాగరాజు తెలిపారు. గురువారం కడప నుంచి కర్నూలు వచ్చిన ఆయన కర్నూలు నగరంలోని రేడియోస్టేషన్ వద్ద ఉన్న ఎస్‌డబ్ల్యూసీ గోదాములను పరిశీలించారు. గత నాలుగేళ్లుగా ఎటువంటి వినియోగం లేకుండా ఉన్న ఈ గోదాములకు పౌరసరఫరాల సంస్థకు సంబంధించిన 6వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని నిల్వ చేసేందుకు సంస్థ ఎండీ నవ్య, ఛైర్మన్ వెంకటేశ్వరరావు చర్యలు తీసున్నారు. ఈ గోదాములకు బియ్యం రైల్వే రేకు పాయింట్ నుంచి వస్తుండడంతో గోదాములను పరిశీలించేందుకు వచ్చామనీ ఆర్ఎం సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా లారీలను నిల్వ చేసేందుకు, అదే విధంగా తూకం వేసేందుకు ఏర్పాటు చేసిన వేయింగ్ కాటాను పరిశీలించారు. ఆర్ఎం విలేకరులతో మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా రాయలసీమలోని ఎస్‌డబ్ల్యూసీ గోదాముల్లో ఆహార ఉత్పత్తుల నిల్వలు లేక నిరుపయోగంగా ఉన్నాయని, ప్రస్తుతం ఆ గోదాములన్నింటిలో పౌరసరపరాల సంస్థకు చెందిన బియ్యంతో పాటు రైతుల నుంచి సేకరించిన ఆహార ఉత్పత్తులను నిల్వ చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. కర్నూలు, కడప, అనంతపురం ఉమ్మడి జిల్లాలో 1,12,789 మెట్రిక్ టన్నుల ఆహార ఉత్పత్తులను నిల్వ చేసే సామర్థ్యం నిల్వ ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. ఈ గోదాముల్లో పూర్తి స్థాయిలో ఆహార ఉత్పత్తులను నిల్వ ఉంచేలా ఎస్‌డబ్ల్యూసీ ఎండీ, ఛైర్మన్ వైస్ ఛైర్మన్ ఆదేశించారని చెప్పారు. ఇందులో భాగంగానే సంస్థ గోదాములను ఏవేవి నిరుపయోగంగా ఉన్నాయో గుర్తించి వాటిల్లో సివిల్ సప్లయ్ చెందిన బియ్యంతో పాటు రైతుల నుంచి సేకరించిన ఆహార ఉత్పత్తులను నిల్వ చేసేందుకు త్వరితగతిన చర్యలు చేపడుతున్నామని ఆర్ఎం చెప్పారు. నంద్యాలలో 9వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సంస్థ గోదాముల్లో నిల్వ చేసేందుకు చర్యలు తీసుకున్నామని, అదే విదంగా డోన్‌లో రైతులకు సంబంధించిన 2వేల మెట్రిక్ టన్నుల కందులను నిల్వ చేశామని, నాలుగేళ్లుగా నిరుపయోగలో ఉన్న కర్నూలు నగరంలోని రేడియోస్టేషన్ వద్ద ఉన్న ఎస్‌డబ్ల్యూసీ గోదాముల్లో 6వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని నిల్వ చేస్తున్నామని తెలిపారు. కర్నూలు నగరంలోని ఇందిరాగాంధీనగర్ వద్ద ఉన్న గోదాములను పూర్తిస్థాయిలో ఆధునికీకరించి సంసకు ఆదాయాన్ని పెంచేందుకు చర్యలు తీసుకునే ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయని చెప్పారు.

అక్రిడిటేషన్లకు దరఖాస్తు చేసుకోండి

• సమాచార శాఖ డీడీ జయమ్మ

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అక్రిడిటేషన్లకు దరఖాస్తు చేసుకోవాలని సమాచారశాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.జయమ్మ సూచించారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. జర్నలిస్టులు mediarealtions.ap.gov.in వెబ్‌సైట్‌లో వ్యక్తిగతంగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అక్రిడిటేషన్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నాక జర్నలిస్టులు తాము పని చేస్తున్న సంస్థ వివరాలు ఇచ్చి దరఖాస్తు సబ్‌మిట్ చేయవచ్చున్నారు. అదేవిధంగా జిల్లా నుంచి ప్రచురితం అవుతున్న దినపత్రికలు, పీరియాడికల్స్, కేబుల్ చానల్స్ సంస్థల వివరాలు పోర్టల్‌లో పొందుపరిచిన అనంతరమే దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం అవుతుందన్నారు. దినపత్రికలు, పీరియాడికల్స్, కేబుల్ టీవీ యాజామాన్యాలు సంబంధిత పత్రాల డాక్యుమెంట్లను పెన్‌డ్రైవ్‌లో పొందుపరిచి ఒక సెట్ ఫొటోస్టాట్‌ను కలెక్టరేట్‌లోని జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి

• యువతకు మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ పిలుపు
• ముగిసిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు


టీజీ వెంకటేశ్, ప్రముఖులతో విద్యార్థులు

కర్నూలు కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విజ్ఞానానికి నిలయాలైన గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ యువతకు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వారం రోజులుగా కొనసాగుతున్న 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం వైభవంగా ముగిశాయి. ముగింపు వేడుకలు, బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా టీజీ వెంకటేశ్ హాజరయ్యారు. జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ ఆనాటి జాతీయ నేతలు ముందుచూపుతో యువతకు విద్యతోపాటూ విజ్ఞానాన్ని అందించేందుకు గ్రంథాలయాలను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. మారుతున్న కాలానుగుణంగా గ్రంథాలయాల్లో అవసరమైన పుస్తకాలతోపాటూ, నేటి యువతకు పోటీ పరీక్షలకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలు కలిగి ఉన్నాయని చెప్పారు. తాను పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్‌గా ఉన్నప్పుడు గ్రంథాలయాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు తెలిపారు. గ్రంథాలయాల అభివృద్ధికి ప్రజల నుంచీ వచ్చే పన్నులతోనే కాకుండా ప్రభుత్వాలు కూడా ప్రత్యేక నిధులు కేటాయించి వాటి అభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇదిలా ఉండగా వారం రోజులుగా వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు టీజీ వెంకటేశ్ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామికవేత్త బీవీ రెడ్డి, విద్యాసంస్థల అధినేత డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్లు కేసీ కల్కూర, కేజీ గంగాధరరెడ్డి తదితరులు ప్రసంగించారు. అనంతరం అతిథులను గ్రంథాలయ సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి వి.పెద్దక్క ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్లు వజ్రాల గోవిందరెడ్డి, ఎస్.బాషా, మక్బుల్ బాషా, నసీమా బీ, రేణుక, పద్మావతమ్మ, ఈశ్వరమ్మ, నాగభాస్కర్, ఉమ తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మం పవిత్రమైనది : వీహెచ్‌పీ


సమావేశమైన వీహెచ్‌పీ సభ్యులు

శ్రీశైలం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మానవజాతి మనుగడలో ప్రధాన పాత్ర పోషించే హైందవ సనాతన ధర్మం ఎంతో పవిత్రమైనవని నంద్యాల జిల్లా విశ్వ హిందూ పరిషత్ అధ్యక్షుడు బుగ్గన చంద్రమౌళీశ్వరరెడ్డి అన్నారు. గురువారం సున్నిపెంట బ్రహ్మంగారి దేవాలయ ప్రాంగణంలో వీహెచ్‌పీ ప్రతినిధులు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ శ్రీశైల క్షేత్ర పరిధిలోని గిరిజన తండాలు, ఎస్సీఎస్టీ కాలనీలో నివసించే వారిని బలవంతపు మత మార్పిడి జరగకుండా అడ్డుకోవడంతో పాటు హిందూధర్మంపై అవగాహన కల్పించడమే వీహెచ్‌పీ లక్ష్యమన్నారు. కొంత కాలంగా హిందూ కుటుంబాలను కొందరు ప్రలోభపెడుతూ మతమార్పిడికి పాల్పడుతున్నారన్నారు. వీటిని హైందవులు అడ్డుకోవాలన్నారు. ఈ సమావేశంలో వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి కిషోర్ కుమార్, లీగల్‌సెల్ కన్వీనర్ గిరిధర్‌బాబు, దూరదర్శన్ సబ్‌ఎడిటర్ రాజుస్వామి, అరవింద్, గెల్లి వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

యాజమాన్యాలపై చర్య తీసుకోవాలి

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటించని బీఈడీ కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి బి.సోమన్న, ఎస్.సాబీర్ బాషా గురువారం ప్రకటనలో కోరారు. ఆర్‌యూ పరిధిలోని కళాశాలలో ఎన్‌సీఈఆర్టీ నిబంధనలను పట్టించుకోకుండా ఇతర రాష్ట్రాల విద్యార్థులను చేర్చుకుని స్థానిక విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. కళాశాలలకు సొంత భవనాలు లేవని, బ్లాక్ టీచింగ్ ప్రాక్టికల్స్, క్లాస్‌రూమ్స్ లేకుండా పరీక్షలు రాయిస్తున్నట్లు తెలిపారు.

యువతతో దేశ భవిష్యత్తు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఇందిరాశాంతి

కర్నూలు అర్బన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): యువతతోనే దేశ భవిష్యత్తు ఉంటుందని ప్రిన్సిపాల్ ఇందిరాశాంతి సూచించారు. గురువారం ప్రభుత్వం బాలుర డిగ్రీ కళాశాలలో భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో 'నషాముక్త యువ వికసిత్ భారత్' నిర్వహించారు. వ్యసనాలకు లోను కాకుండా ఆరోగ్యకరమైన జీవన శైలిఅలవరచుకోవాలని కోరారు. డాక్టర్ మెక్షేశ్వరుడు, శివసాయినాథ్, వైఎస్ ప్రిన్సిపాల్ ఎ. సత్యనారాయణ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఫక్రున్నీసా బేగం, వెంకట స్వామి, రోషన్న, నారాయణ రెడ్డి, జాఫరున్నీసా తదితరులు పాల్గొన్నారు.

'అశోకా'లో క్యాంపస్ డ్రైవ్



మహీంద్రా ప్రతినిధులతో సీఈవో డా. హరీష్ కృష్ణ

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): దూపాడు సమీపంలోని అశోకా మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ప్లేస్‌మెంట్ డ్రైవ్ గురువారం ముగిసింది. టెక్ మహేంద్ర ప్రతినిధుల ఆధర్యంలో నిర్వహించిన ఎంపికలకు 1,327 మంది అభ్యర్థులు హాజరయ్యారు. రెండు రౌండ్లు పూర్తయ్యాయని త్వరలోనే ఫైనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు టెక్ మహేంద్ర హెచ్‌ఆర్ జానీ బేగమ్ పాల్గొన్నారు. సీఈవో డా.హరీష్ కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు చదువు మాత్రమే కాదు.. ఉద్యోగ ఉపాధి అవకాశాలు అందేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



గ్రంథాలయంలో బహుమతులు అందుకున్న విద్యార్థులు

ఓర్వకల్లు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో గ్రంథాలయ వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. వారోత్సవాల ముగింపు సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, ఆటల పోటీలు గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయ అధికారులు హనుమా నాయక్, సౌజన్య, కౌసల్య, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన కార్తీక మాసం

● కర్నూలు, కోడుమూరు, కాల్వబుగ్గలో పూజలు చేసిన భక్తులు



కర్నూలు: హరిహర క్షేత్రంలో అన్నాభిషేకం

కర్నూలు కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నెలరో పాటూ కొనసాగిని కార్తీక మాసం పూజలు గురువారం ముగిశాయి. నగరంలోని సంకల్‌బాగ్ హరిహర క్షేత్రంలోని భవానీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో అన్నాభిషేకం నిర్వహించారు. నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో భక్తులకు పూజల అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. నెహ్రూనగర్‌లోగల మహాబలేశ్వర స్వామి వారి ఆలయంలో కార్తీకమాసం చివరి రోజు పూజలను నిర్వహించారు. వీహెచ్‌పీ నాయకులు కృష్ణపరమాత్మ, ఆలయ కమిటీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోడుమూరు రూరల్: ప్యాలకుర్తి భీమలింగేశ్వర, లద్దగిరి రామలి ంగేశ్వర, వర్కూరు సిద్ధేశ్వర స్వామి ఆలయాల్లో అభిషేకాలు, పుష్ప, బిల్వార్చన చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులను ఊరేగించారు. వెంకటగిరిలో భజనపోటీలు నిర్వహించారు.

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గ, కొమ్ముచెరువు, కాల్వ, భైరాపురం గ్రామాల్లో వెలసిన ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు పోటెత్తారు. కాల్వబుగ్గ రామేశ్వర స్వామి ఆలయంలో శివునికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన పూజలు చేశారు. ఎస్ఐ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు



కోడుమూరు రూరల్: వెంకటగిరిలో రాష్ట్రస్థాయి భజన పోటీలు



ఓర్వకల్లు: కాల్వబుగ్గలో పూజల కోసం క్యూలో నిల్చున్న భక్తులు

పనిచేయని శానిటేషన్ కార్యదర్శులపై చర్యలు

● నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్



పారిశుధ్య పనులను తనిఖీ చేస్తున్న కమిషనర్ విశ్వనాథ్

కర్నూలు న్యూసిటీ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన శానిటరీ ఇన్‌స్పెక్టర్, కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశించారు. గురువారం లక్ష్మీనగర్, మద్దూర్‌నగర్, ప్రకాష్‌నగర్ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ చెన్నయ్యతో పాటు ఇద్దరు శానిటేషన్ కార్యదర్శులపై చర్యలు తీసువాలన్నారు. నగరంలో పారిశుధ్య పనుల జాప్యం సహించబోమని, వందశాతం డోర్ టూ డోర్ చెత్త సేకరణ జరగాలని స్పష్టం చేశారు. ప్రజలపై దాడి చేస్తున్న 52 వీధి కుక్కలను గార్గేయపురం డంప్‌యార్డుకు తరలించామన్నారు. కార్యదర్శి నాగరాజు, ప్రజారోగ్య అధికారి డా.నాగశివ ప్రసాద్, కార్పొరేటర్ రమణమ్మ పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



ధర్నాలో మాట్లాడుతున్న నరసింహులు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.నరసింహులు డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ వద్ద సుధాకరప్ప అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. బోర్డును పునరుద్ధరించడంతో పాటు పెండింగ్‌లో క్లైయిమ్‌లను వెంటనే నిధులు విడుదల చేయాలన్నారు. బోర్డు ఉన్నప్పుడు కార్మికులకు ప్రమాదం చోటుచేసుకుంటే రూ.5 లక్షల బీమా అందేదదని, కార్మికుడి ఇంట్లో పెళ్లికి రూ.20 అందేదన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. అంజిబాబు, ఖాజాబాషా, టి.రాముడు, జాఫర్ హుస్సేన్ పాల్గొన్నారు.

చెత్తను సేకరించాలి

ఓర్వకల్లు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో చెత్త సేకరణను క్రమం తప్పక చేయాలని ఎంపీడీవో నాగఅనుసూయ సూచించారు. గురువారం మండలంలోని హుశేనాపురం గ్రామంలో చెత్త సేకరణను తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

అధ్వానంగా పారిశుధ్య నిర్వహణ

కర్నూలు న్యూసిటీ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలో పారిశుధ్య నిర్వహణ అధ్వాన్నంగా ఉందని. నగర పాలక అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ.కృష్ణ మండిపడ్డారు. గురువారం నగర పాలక సమావేశ భవనంలో శానిటేషన్ ఇన్స్‌పెక్టర్లు, కార్యదర్శులతో డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్‌రెడ్డి, ప్రజారోగ్య అధికారి డా.నాగశివప్రసాద్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ట్రేడ్ లైసెన్స్ వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని, పురమిత్ర, పీజీఆర్ఎస్, పత్రికల్లో వచ్చే కథనాలపై తక్షణమే స్పందించాలన్నారు. సామూహిక మరుగుదొడ్లను రోజూ శుభ్రం కేయించాలన్నారు. డి.సి.సతీష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పూడితకతీత నిరంతరంగా కొనసాగించాలన్నారు. కార్యదర్శి నాగరాజు, సూపరింటెండెంట్ నాగరాజు, వీరకుమార్, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు రమేష్, మునిస్వామి, ఆర్.రాజు, చెన్నయ్య, ముర్తుజా, శివకుమార్, జిలానీపాల్గొన్నారు.



మాట్లాడుతున్న అడిషనల్ కమిషనర్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మరమ్మతు పనుల్లో భాగంగా సెంట్రల్ సెక్షన్ ఫీడర్‌లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ నాగప్రసాద్ ప్రకటనలో తెలిపారు. కొత్తబస్టాండ్, కల్లూరు ఈద్గా ఏరియా, మహావీర్‌నగర్ ప్రాంతాల్లో ఉదయం 7 నుండి 11 గంటల వరకు సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

సీఎం కృషితో పెట్టుబడులు

కర్నూలు అర్బన్ నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించడం సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సత్రం రామకృష్ణుడు అన్నారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ ఇటీవల విశాఖపట్నంలో సీఐఐ భాగస్వామ్య సదస్సును విజయవంతం కావడంతో ఇతర రాష్ట్రాల ప్రతినిధులు మన రాష్ట్రంవైపు చూస్తున్నాయన్నారు. 613 పారిశ్రామిక వేత్తలు 12 రంగాల్లో పెట్టు బడులు పెట్టేందుకు అంగీకార పత్రాలు కుదుర్చుకున్నారని తెలిపారు. రూ.7.63 లక్షల కోట్ల పెట్టుబడులతో అగ్రిమెంట్ చేసుకున్నారని జిల్లాలో గ్రీన్ హబ్‌తో పాటు పారిశ్రామిక హబ్‌కు వేలాది కోట్ల నిధులు మంత్రులు టీజీ భరత్ లోకేష్ కృషితో పరిశ్రమలు తీసుకురావడం హర్షణీయమన్నారు.



సత్రం రామకృష్ణుడు

వలసలను నివారించాలి

సి.బెళగల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జాబ్‌కార్డు ఉన్న కూలీలకు ఉపాధి పనులు కల్పించి వలసలను నివారించాలని ఎంపీడీవో రాణెమ్మ ఆదేశించారు. గురువారం మండలంలోని కంబందహాల్, చింతమానుపల్లె గ్రామాల్లో పర్యటించారు. వలస వెళ్లేవారికి ప్రభుత్వం పథకాలు వర్తించవన్నారు. మహిళా రైతులు గ్రూపులుగా ఏర్పడి ప్రభుత్వ రాయితీ రుణాలను ఉపయోగించుకోవాలన్నారు. పాడిపరిశ్రమ, కోళ్ళ పెంపకం, వ్యాపారాలను చేసి అభివృద్ధి చెందాలని వివరించారు. పొదుపు ఎపీఎం రమేష్, ఉపాధి ఎపీవో రామన్న, ఈసీ రంగస్వామి ఉపాధి సిబ్బంది ఉన్నారు.

జయప్రదం చేయండి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు విశాఖలో నిర్వహిచనున్న సీఐటీయూ 18వ మహసభలను జయప్రదం చేయాలని ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు పిలుపునిచ్చారు. గురువారం కేకే భవన్‌లో మాట్లాడుతూ మూడు సంవత్సరాలుగా చేసిన ఉద్యమాలను సమీక్షించుకుని, భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. అంగన్‌వాడీ వర్కర్స్ నాయకురాలు బాలదుర్గమ్మ, వెంకటమ్మ, శైలజ, నీరజ, రేణుకమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపిక



రుద్రతేజతో ప్రిన్సిపాల్ డేవిడ్

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎడిఫై ఇంగ్లీషు మీడియం పాఠశాల పదో తరగతి చదువుతున్న రుద్రతేజ జిల్లా స్థాయి బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీల్లో ప్రతిబ కనబరిచి రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలకు ఎంపికయ్యాడు. గురువారం ప్రిన్సిపాల్ డేవిడ్ విద్యార్థిని అభినందించి, రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. తీర్చిదిద్దిన వ్యాయామ ఉపాధ్యాయుడు కాశీంను అభినందించారు.

సహకార వ్యవస్థను బలోపేతం చేద్దాం

● సొసైటీ అధ్యక్షుడు సీఎన్ సుధాకర్ రెడ్డి



మాట్లాడుతున్న అధ్యక్షుడు సీఎన్ సుధాకర్ రెడ్డి

ఓర్వకల్లు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సహకార వ్యవస్థను బలోపేతం చేస్తే రైతుకు ప్రయోజనాలు ఉన్నాయని సొసైటీ అధ్యక్షుడు సీఎన్ సుధాకర్ రెడ్డి అన్నారు. గురువారం హుశేనాపురం సహకార పరపతి సంఘంలో 72వ అఖిల భారత సహకార వారోత్సవాలు నిర్వహించారు. డీసీవో వెంకటకృష్ణ, డీఎల్‌సీవోలు జయాకర్, చెన్నమ్మ ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో తిరిగి చెల్లించి సొసైటీని అభివృద్ధి బాటలో నడిపించాలన్నారు. సొసైటీ సిబ్బందివిధులకు సక్రమంగా హాజరై రైతులక సేవలదించాలని కోరారు. డైరెక్టర్ మాలిక్‌బాషా, సీఈవో మానిక్, కాల్వబుగ్గ ఛైర్మన్ కాటినేని నారాయణ, మాజీ ఛైర్మన్ చంద్రపెద్దస్వామి, రైతులు షంషుద్దీన్, శేషన్న, గిడ్డయ్య, జయకృష్ణ పాల్గొన్నారు.

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి

సి.బెళగల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలను వినియోగించుకోవాలని లైబ్రేరియన్ రమణ సూచించారు. గురువారం స్థానిక జడ్పీ ఉన్నతపాఠశాల, గురుకులపాఠశాల పదో తరగతి విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. అనంతరం విజేతలకు జడ్పీ హెచ్ఎస్ హెచ్ఎం నాగలక్ష్మి, గురుకుల ప్రిన్సిపాల్ చింతలయ్య జ్ఞాపికలు అందజేశారు



జ్ఞాపిక ఇస్తున్న ప్రిన్సిపాల్ చింతలయ్య

రాష్ట్రస్థాయికి ఎంపిక



విద్యార్థితో హెచ్ఎం, ఉపాధ్యాయులు

కోడుమూరు రూరల్, నవంబరు 20, (ఆంధ్రజ్యోతి): అమడగుంట్ల జడ్పీ ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి భాగ్యరాజు రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం అనంతయ్యయాదవ్ తెలిపారు. గురువారం మాట్లాడుతూ ఇటీవల కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో జిల్లాస్థాయి పోటీలో ప్రతిభ కనబరిచారన్నారు. ఈ నెల 29, 30 తేదీల్లో గుంటూరులో నిర్వహించనున్న అండర్-14 క్రికెట్ పోటీల్లో భాగ్యరాజు పాల్గొంటారని తెలిపారు. పీడీ మహ్మద్‌రఫీ, ఉపాధ్యాయులు చంద్రమోహన్, మురళీకృష్ణ పాల్గొన్నారు.

మరుగుదొడ్లు నిర్మించాలి

సి.బెళగల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మహిళలకు సామూహిక మరుగదొడను నిర్మించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. నాయకుడు మోహన్ మాట్లాడుతూ మండల కేంద్రానికి మహిళలు పలు రకాల పనుల నిమిత్తం వస్తుంటారని, బస్టాండు అవరణను వ్యాపారులు ఆక్కకరమించుకోవడంతో కూర్చోవడానికి కూడా ఇబ్బంది ఉందన్నారు. ఇటీవలే కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ఆదేశాలను కూడా మండల అధికారులు పట్టించుకోలేదన్నారు. ఉశెన్, ఖాజ, దస్తగిరి, చంటి, రాముడు, రంగన్న ఉన్నారు.

ఎఫ్ఆర్ఎస్ వేయకుంటే గైర్హాజరుగా పరిగణిస్తాం

● జీజీహెచ్ సూపరింటెండెంట్ డా. వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న సూపరింటెండెంట్

కర్నూలు హస్పిటల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన వైద్యశాల వైద్యులు, సిబ్బంది ఎఫ్ఆర్‌సీ హాజరు వేయకుంటే గైర్హాజరుగా పరిగణిస్తామని హస్పిటల్ సూపరింటెండెంట్ డా.వెంకటేశ్వర్లు హెచ్చరించారు. గురువారం ధన్వంతరి హాలులో ఆయన వివిధ విభాగాల హెచ్‌వోడీలతో సమీక్ష నిర్వహించారు. ఇక నుంచి అకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని, సమయపాలన పాటించని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బంది హాజరును నమోదు చేయాలని, ఆసుపత్రిలో సెక్యూరిటీ సేవలను మరింత పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు. డిప్యూటీ సూపరింటెండెంట్లు డా.లక్ష్మిబాయి, డా.నాగేశ్వరరావు, సీఎస్ఆర్ఎంవో డా.పద్మజ పాల్గొన్నారు.



మంత్రిని కలిసిన విజయ్

ఉద్యోగాలివ్వడం హర్షణీయం

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో ఖాళీగా ఉన్న కులవృత్తి ఉద్యోగాల్లో నాయీ బ్రాహ్మణులకు అవకాశం ఇవ్వడం హర్షణీయమని కార్పొరేషన్ డైరెక్టర్ పాలకవీటి విజయ్ కుమార్ అన్నారు. గురువారం దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కలికి కృతజ్ఞతలు తెలిపారు. సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

కాలుష్యాన్ని నివారిద్దాం

కర్నూలు అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి కాలుష్యాన్ని నివారిద్దామని ఇన్‌చార్జి వీసీ వెంకట బసవరావు సూచించారు. గురువారం క్లస్టర్ యూనివర్సిటీలోని గంథాలయం ప్రాంగణంలో రిజిస్ట్రార్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ ఇందిరా శాంతి, అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ప్రవేశాలు, గంథాలయ సౌకర్యాలు తెలుసుకున్నారు. వైస్ ప్రిన్సిపల్ జీ. హేమంత్, ఏ సత్యనారాయణ, ఎన్‌సీసీ కోఆర్డినేటర్ డా. ఫక్రున్నీసా బేగం ఉన్నారు.

రైతు బజారు నుంచి దళారుల తొలగింపు

● పోలీసుల సాయంతో 50 మందిని బయటకు పంపిన అధికారులు



దళారులను బయటకు పంపుతున్న పోలీసులు

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సి.క్యాంపు రైతు బజారులో ఏళ్ల తరబడి తిష్టవేసిన దళారులను బయటకు పంపారు. గురువారం సీఐ కేశయ్య, సిబ్బంది రైతుబజారు అధికారులు, సెక్యూరిటీ గార్డులు సంయుక్తంగా చర్యలు తీసుకోవడంతో రైతులు, వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ నాయకుల ఒత్తిడి, ఇతర కారణాలతో రైతులకు చెందాల్సిన స్థలాలను ఆక్రమించడంపై 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక వరుస కథనాలు ప్రచురించింది. ఎట్టకేలకు ఉన్నతాధికారుల ఆదేశాలతో ఎస్టేట్ అధికారి కళ్యాణమ్మ, ఉద్యాన శాఖ అధికారి శివకుమార్ త్రీటౌన్ సీఐ కేశవయ్యను కలిసి దళారులను ఏరివేసేందుకు సహకరించాలని కోరడంతో సీఐ, పోలీసులు రైతుబజారుకు చేరుకుని వెంటనే బయటకు వెళ్లకుంటే కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాదాపు 50 మంది దళారులను బయటకు పంపినట్లు ఎస్టేట్ అధికారి కళ్యాణమ్మ తెలిపారు. సెక్యూరిటీ గార్డులు శ్రీనివాసరెడ్డి, చిన్నస్వామి, గురువయ్య గోపాల్, హనుమంతు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సత్యసాయి మహోత్సవాలు



సత్కారాలు అందుకున్న సేవాదళ్ సభ్యులు

కర్నూలు కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నెహ్రూనగర్‌లోగల సత్యసాయి మందిరంలో పుట్టపర్తి సత్యసాయి బాబా శతవర్ష జన్మదిన మహోత్స వాలు కొనసాగుతు న్నాయి. ఆరోరోజు గురువారం ఉదయం ప్రత్యేక పూజలు, విభిన్న రకాల పూలతో, పండ్లతో అర్చనలు నిర్వహించి, నైవేద్యాలు సమర్పించారు. సాయంత్రం 5 గంటల నుంచీ 6.30 గంటల వరకు సాయి భక్తులతో సామూహిక వేద పఠనం అనంరతం, సేవాదళ్ సభ్యులను సత్కరించారు.

'కేశవరెడ్డి'లో గ్రంథాలయ వారోత్సవాలు

కల్లూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కృష్ణానగర్ కేశవరెడ్డి స్కూల్‌లో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం గురువారం నిర్వహించారు. నవంబరు 14 నుంచి 20 వరకు చిన్నారులకు వ్యాసరచన, క్రీడాపోటీలను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి సంధ్యారాణి, కేశవరెడ్డి ప్రిన్సిపాల్ కుర్షిద్‌ఖనం, ఉపాధ్యాయులు బి.లక్ష్మీదేవి, మంజుల, మాదవీలత, శోభ, మోబినా పాల్గొన్నారు.



బహుమతులు ఇస్తున్న గ్రంథాలయ అధికారి సంధ్యారాణి

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి

● పత్తికొండ, దేవనకొండలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కేఈ శ్యామ్ బాబు



ఎమ్మెల్యే కేఈ మాట్లాడుతున్న జొన్నగిరి టీడీపీ నాయకులు

తుగ్గలి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):టీడీపీతోనే రాష్ట్ర అభివృద్ధి చెందుతుందని, దీంతో ప్రతి పేదవాడు అభివృద్ధి చెందుతారనీ టీడీపీ జొన్నగిరి పట్టణ అధ్యక్షుడు లక్ష్మణస్వామి యాదవ్ అన్నారు. గురువారం పత్తికొండలో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబును కలిసి వారి సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఎన్టీఆర్ వైద్యసేవలు అందించడంతో పాటు ఆ పథకానికి అర్హులు లేకుంటే సీఎం రిలీఫ్ ఫండ్ అందిస్తున్నారన్నారు. అంతేగాకుండా గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టడమే కాకుండా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జయరాం, అంజి, బాల్‌రాజు, అశోక్ పాల్గొన్నారు.

దేవనకొండ: సీఎం సహాయ నిధి పేదలకు వరమని పత్తికొండ ఎమ్మెల్యే కెఈ శ్యాంబాబు అన్నారు. మండలంలోని నేలతలమర్రికి చెందిన ఈ ప్రతాప్‌గౌడ్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడటంతో, ఆరోగ్య ఖర్చుల కింద రూ.1,75,204 సీఎం సహాయ నిధి నుండి నిధులు మంజూరు అయ్యాయి. దాంతో ఎమ్మెల్యే బాధితుడికి చెక్ పంపిణీ చేశారు. కన్వీనర్ విజయ్‌భాస్కర్‌గౌడ్, రాజశేఖర్‌గౌడ్, రాజగోపాల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పత్తికొండ:పేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరమని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. గురువారం టీడీపీ కార్యాలయంలో రూ.7 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.

హంద్రీనీవా జలాలతోనే సస్యశ్యామలం

● సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్



ధర్నాలో పాల్గొన్న సీపీఎం నాయకులు

పత్తికొండ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా జలాలతోనే వెనుకపడిన పత్తికొండ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని, ఆ దిశగా పాలకులు పంట పొలాలకు సాగునీరు అందించే దిశగా పాటుపడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తేరుబజారు నుంచి ఆ పార్టీ శ్రేణులు స్థానిక సమస్యలను పరిష్కరించాలని, కోరుతూ ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. గౌస్ దేశాయ్ మాట్లాడుతూ పత్తికొండ ప్రాంతంలో ఏటా నిండుగా హంద్రీనీవా జలాలు పారుతున్నా ఈ ప్రాంత రైతులకు చుక్కనీరు కూడా అందడం లేదన్నారు. ఇప్పటికైనా పత్తికొండ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో హంద్రీనీవాకు స్లూయిజ్ ఏర్పాటు చేసి పంట పొలాలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, జిల్లా నాయకులు ఆనంద్‌బాబు, రంగారెడ్డి, దస్తగిరి, గోపాల్, రవిచంద్ర, కొండారెడ్డి, శ్రీరాములు, భాస్కర్‌రెడ్డి, కాశన్న, రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్ఫూర్తి.. ఝాన్సీ లక్ష్మీబాయి

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : నేటి యువతకు విద్యార్థులకు రాణి ఝాన్సీ లక్ష్మీబాయి జీవితం స్ఫూర్తి అని ఏబీవీపీ పట్టణ విభాగ కన్వీనర్ ఎర్రిస్వామి న్యాయవాది పద్మాదేశాయ్ అన్నారు. గురువారం పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఝాన్సీ లక్ష్మీబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైస్ ప్రిన్సిపాల్ నాగజ్యోతి, వీరేష్, మహేష్, గోవిందరాజు, శివ చరణ్, హనుమేష్, రాహుల్, రంగనాథ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల దాతృత్వం

ఆదోని టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ ఉద్యోగులు టీబీ వ్యాధిగ్రస్థులకు పోషకాహార కిట్లను అందజేసి తమ దాతృత్వాన్ని చాటుకొన్నారు. గురువారం టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డా. శేఖన్ భాను అధ్యక్షతన, ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ మేనేజర్ మద్దిలేటి ఆధ్వర్యంలో రోగులకు పోషక ఆహార కిట్లను అందజేశారు. కార్యక్రమంలో దాతలు మాట్లాడుతూ, అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల వారు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని రోగులను ఆదుకోవాలని సూచించారు. సూపర్వైజర్ బాబు రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

పక్కీరప్ప స్వామికి పూజలు

మద్దికెర, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామంలో వెలసిన భక్తుల ఆరాధ్య దైవమైన శ్రీ పక్కీరప్ప స్వామి పూజలు వైభవంగా జరిగాయి. గురువారం కార్తీక మాసంలో చివరి రోజు అమావాస్య పర్వదినం సందర్భంగా దేవాలయంలో మూలవిరాట్ పక్కీరప్పస్వామికి పూజలు చేశారు. సాయంత్రం పక్కీరప్ప స్వామి ఉత్సవమూర్తిని పల్లకిలో ఏర్పాటు చేసి గ్రామ పురవీదుల గుండా ఊరేగింపు చేశారు.

●మండల కేంద్రంలోని మద్దమ్మకుంట గ్రామ సమీపాన వెలసిన సుబ్రహ్మణ్యస్వామి దేవాలయంలో మూలవిరాట్ సుబ్రహ్మణ్య స్వామికి ఘనంగా గురువారం పూజలు చేశారు

రైతులకు ఆర్థిక సహకారం అందించాలి

పత్తికొండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల ద్వారా రైతులకు ఆర్థిక సహకారం అందిద్దామని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. గురువారం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని సహకార సంఘాల అధ్యక్షులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రైతులకు దీర్ఘకాలిక రుణాలు అందించాలని, సబ్సిడీపై వ్యవసాయ ఆధారిత పనిముట్లు అందించాలన్నారు. రాయితీపై ఎరువులు అందించేందుకు కృషిచేయాలన్నారు. చందోలి రంగప్ప, ఎద్దులదొడ్డి ప్రభాకర్, అప్పవేణు, రమాకాంత్‌రెడ్డి, ఆనంద్, ఎర్రిస్వామి, నక్కనాగరాజు, శేషాద్రిపాల్గొన్నారు.

పట్టాలు ఇచ్చిన రైతులకే పొలాలు ఇవ్వాలి

తుగ్గలి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గతంలో పట్టాలు ఇచ్చిన రైతులకే పొలాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నబీ రసూల్ మండల కార్యదర్శి సుల్తాన్ అన్నారు. గురువారం మండల కేంద్రమైన తుగ్గలిలో లింగయానదొడ్డి గ్రామంలో సీపీఐ నాయకులు గతంలో ఇచ్చిన పట్టాల రైతులకే పొలాలు ఇవ్వాలని తహసీల్దార్ రవికి వినతి పత్రం అందజేశారు. రైతులకు పొలాలు ఇవ్వకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామన్నారు. సీపీఐ నాయకులు నరసింహుడు, తహసీల్దార్ హరీష్ చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి


వసతుల గురించి వివరాలు అడుగుతున్న వైద్యాధికారి

దేవనకొండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలనిజిల్లా అసంక్రమిత వ్యాధుల నియంత్రణ అధికారి డా. మహేశ్వర్ ప్రసాద్ అన్నారు. దేవనకొండలోని ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్‌ని తనిఖీ చేశారు. ముప్పైఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికి స్క్రీనింగ్ పరీక్షలు చేయాలన్నారు. పరిక్షలో నోటి, రొమ్ము, గర్భశయ క్యాన్సర్లు గుర్తిస్తే, వారికి మెరుగైన వైద్యం అందేలా చుడాలన్నారు. వైద్యాధికారి కళ్యాణ్, సీహెచ్‌వో భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మను దర్శించుకున్న వైకుంఠం జ్యోతి

ఆలూరు, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని కనకదుర్గమ్మదేవి ఆలయంలో అమావాస్య సందర్భంగా గురువారం ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ బొర్ర రాధాకృష్ణ ఆమెకు స్వాగతం పలికి పూజలో పాల్గొన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, యువనేత నారా లోకేష్ సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ప్రార్థించినట్లు వారు తెలిపారు. ఆమె పూజలో కుమారుడు వైకుంఠం సాయిదినేష్ పాల్గొన్నారు.

సౌకర్యాలు సద్వినియోగం చేసుకోవాలి


దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఏబీసీడబ్ల్యూవో మాదప్ప

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : వెనుకబడిన సామాజిక సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఆదోని డివిజన్ సహాయ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ మాదప్ప అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ బీసీ బాలుర హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఎంతోమంది హాస్టల్‌లో ఉండి చదువుకుని ఉన్నత స్థానంలో ఉన్నారని వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. చలికాలం కావడంతో 200మంది విద్యార్థులకు దుప్పట్లు అందజేశారు. వార్డెన్ అనిమి రెడ్డి, గంగాధర్ పాల్గొన్నారు.

'పక్కా గృహాలు నిర్మించుకోండి'

మద్దికెర, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద ప్రజలకు పక్కా గృహాల నిర్మాణానికి మంజూరు చేసిందని, వెంటనే నిర్మించుకోవాలని, లేకపోతే మంజూరు రద్దు చేస్తామని ఎంపీడీవో కొండయ్య తెలిపారు. గురువారం మండల పరిధిలోని హంపా గ్రామంలో గత రెండేళ్ల క్రిందట పక్కా గృహాలు మంజూరై నిర్మాణం చేపట్టిన వారికి నిర్మించుకోకపోవడంతో లబ్దిదారులకు అవగాహన కల్పించారు. విధుల పట్ల ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని ఉద్యోగులను హెచ్చరించారు.. హంపా గ్రామంలో నిరూపయోగంగా ఉన్న చెత్త సంపదకేంద్రాన్ని వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వనూరప్ప ఉన్నారు.

'బీఈడీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి'

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : నిబంధనలు పాటించని బీఈడీ కళాశాలల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షాబీర్ భాష డిమాండ్ చేశారు. గురువారం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో బీఈడీ కళాశాలలో ఎన్‌సీటీఈ నిబంధలను ఉల్లంఘించాయని, లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి కళాశాలలను బ్లాక్ లిస్టులో పెట్టాలని కోరారు. సమావేశంలో పట్టణ నాయకుడు దస్తగిరి, శ్రీకాంత్, శేఖర్, శివ, మోహన్, హుస్సేన్ పాల్గొన్నారు.

'పే స్కేలు అమలు చేయాలి'

వెల్దుర్తి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వీఆర్‌ఏలకు పేస్కేలు అమలుచేయాలని మండల నాయకుడు అయ్యస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డిప్యూటీ తహశీల్దార్ గురుస్వామికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉస్మాన్‌బాషా, మద్దయ్య, వెంకటేశ్వర్లు, సురేశ్, రామాంజనేయులు, పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీవోగా శివకుమార్

మద్దికెర, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):మద్దికెర పంచాయతీ కార్యదర్శి శివకుమార్‌కు డిప్యూటీ ఎంపీడీవోగా పదోన్నతి కల్పించారు. కొన్ని నెలలుగా మద్దికెర పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న ఆయనకు పదోన్నతి కల్పించి కర్నూలు జిల్లాకే కేటాయించారు. ఇందులో భాగంగా ఉత్తర్వులు జారీ అయ్యాయని త్వరలోనే బాధ్యతలు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు.

ఉపాధి పనులు కల్పించాలి

తుగ్గలి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):వ్యవసాయ కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని సీపీఎం మండల అధ్యక్షుడు శ్రీరాములు కోరారు. గురువారం మండల పరిధిలోని ఉప్పర్లపల్లిలో సీపీఎం పార్టీ నాయకులు, ఉపాధి కూలీలు సచివాలయం ఎదుట ఆందోళనలు చేపట్టి సచివాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు వెంటనే పనులు కల్పించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

దేవనకొండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపోటములు సహజమని వాటిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని టీడీపీ నాయకులు బండ్లయ్య, పంచాయతి కార్యదర్శి రఫీ అన్నారు. 58వ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా వ్యాసరచన, క్రీడలలో గెలుపొందిన జ్ఞానసుధ, భారతి పాఠశాల విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. విద్యార్థులు క్రీడలతోపాటు పుస్తకపఠనం అలవర్చుకోవాలన్నారు. గ్రంథాలయాధికారి శ్రీనివాసులు, జగదీష్‌లాల్, సుధాకర్, నజీర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లాంఛనాలతో జవాన్ అంత్యక్రియలు


అంత్యక్రియలు నిర్వహిస్తున్న అధికారులు

మద్దికెర, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక కురువ వీదిలో నివసించే జవాన్ నాగార్జున అంత్యక్రియలు గురువారం ప్రభుత్వ లాంఛనాలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం జవాన్ నాగార్జున భౌతిక కాయంపై ఐటీడీపీ ఎస్ఐ హరీష్ కుమార్ ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ డి.శ్రీనివాసులు, బాలాజీ జాతీయ జెండాను కప్పి నివాళులర్పించారు. అనంతరం శ్మశాన వాటికకు ఘన ఊరేగింపుతో తీసుకెళ్లి పోలీసుల లాంఛనాలతో గాల్లో కాల్పులు జరిపి అంత్యక్రియలు నిర్వహించారు. కుటుంబ సభ్యులను వారు ఓదార్చారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున గ్రామస్థులు, ప్రజలు పాల్గొన్నారు.

ఆదోని జిల్లా కోసం ఉద్యమం

ఆదోని, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆలూరు, మంత్రాలయం నియోజకవర్గాలను కలిపి ఆదోని కేంద్రంగా కొత్త జిల్లాను ప్రకటించాలనే ప్రజల చిరకాల ఆకాంక్షను వినిపిస్తూ ఆదోని టీడీపీ నాయకులు మదిరే భాస్కర్‌రెడ్డి, సౌదీ రావుఫ్, రామచంద్ర, సోమశేఖర్‌రెడ్డి రిలే నిరాహార దీక్షకు మద్దతు తెలిపారు. భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ భౌగోళికంగా దగ్గరగా ఉండి ఒకే విధమైన అభివృద్ధి అవసరాలు కలిగిన ఈ ఐదు నియోజకవర్గాలైన ఆదోని, ఆలూరు, ఎమ్మిగనూరు, పత్తికొండ, మంత్రాలయంలను కలిపి ఆదోని కేంద్రంగా కొత్తగా జిల్లాగా ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. బుద్ధారెడ్డి, మాజీ కౌన్సిలర్ మల్లికార్జున, గోపాల్‌రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు, సర్పంచ్ గోవిందు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



బహుమతులు అందజేస్తున్న విశ్రాంత డీఎస్పీ రంగముని


వెల్దుర్తి: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న లైబ్రేరియన్

ఆలూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఈనెల 14న ఆరంభమైన గ్రంథాలయ వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులకు నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి రిటైర్డ్ డీఎస్పీ రంగముని బహుమతులను అందించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి విజయ భాస్కర్, రిటైర్డ్ హెచ్‌ఎం ఈరన్న, మాజీ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆశాబేగం, మాజీ గ్రంథాలయ చైర్మన్ రామ్మూర్తి, రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి నర్సిరెడ్డి పాల్గొన్నారు.

ఆదోని అగ్రికల్చర్ : పట్టణంలోని పోస్ట్ ఆఫీస్ పక్కన ఉన్న గ్రంథాలయంలో జరిగిన 58వ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ముగిశాయి. గ్రంథాలయ అధికారిణి ఆశాజ్యోతి ఆధ్వర్యంలో వారంరోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. అందులో గెలుపొందిన విద్యార్థులకు ముఖ్య అతిథులుగా హాజరైన ఎంఈవో భూపాల్ రెడ్డి మునిసిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున నెహ్రూమెమోరియల్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఫయాజుద్దీన్ చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరికృష్ణ, రమేష్‌నాయుడు, కీరా, మోహన్ కుమార్ నరసింహులు పాల్గొన్నారు.

వెల్దురి: 58వ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా వెల్దుర్తి గ్రంథాలయంలో లైబ్రేరీయన్ తోటమ్మ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, చిత్రలేఖనం, క్రీడల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు గురువారం ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బీసీ హాస్టల్ వార్డెన్ గిరిజాదేవి, పారిశ్రామికవేత్త సాయిప్రసాద్, ఇరిగేషన్ ఏఈలు రాజు, వెంకటేష్ లు పాల్గొన్నారు.

23న ఉచిత వైద్య శిబిరం

ఆదోని టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : ఈనెల 23వ తేదీన ఉచిత రక్త నాళాల పరీక్ష శిబిరాన్ని నిర్వహించనున్నట్లు అవోపా అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్ గుప్తా తెలిపారు. గురువారం శిబిరానికి సంబంధించిన కరపత్రాలను సంస్థ సభ్యులు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఏఎస్ఎన్ వ్యాస్కులర్ హాస్పిటల్(హైదరాబాద్) శాంతి రామ్ ఆసుపత్రి(నంద్యాల) ఎన్‌టీఆర్ వైద్య సేవ (ఆరోగ్యశ్రీ) సహకారంతో ఎస్‌ఆర్‌ఐ కాకుబాల్ నగేష్ సౌజన్యంతో శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ శిబిరంలో కంటి పరీక్షలు కూడా నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్‌లను చేయించడం జరుగుతుందని, ఆపరేషన్‌లకు ఎంపికైన వారిక అయ్యే రవాణా, భోజన ఖర్చులను సౌజన్యకర్త కాకుబాల్ నాగేష్ ఇవ్వనున్నట్లు తెలిపారు. రక్తనాళాల పరీక్షల కోసం వచ్చేవారు 7337321810కు కంటి పరీక్షల కోసం వచ్చేవారు 9980269662కు ఫోన్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. సభ్యులు శ్రీనాథ్ గుప్తా, రఘు, వెంకటేషులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోండి

దేవనకొండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇంటిలోని మురుగు నీరు బయట రోడ్లపైకి వదలకుండా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకొవాలని ఎంపీడీవో జ్యోతి, డిప్యూటీ ఎంపీడీవో గోపాల్ తెలిపారు. గ్రామాలలో స్వచ్ఛత కోసం ప్రతిఒక్కరు పాటుపడాలన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

ఆలూరు రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ మద్దిలేటిస్వామి అన్నారు. గురువారం మండలంలోని అగ్రహారం గ్రామంలో ఇళ్ల నిర్మాణాలపై ఎంపీడీఓ లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఇళ్ల పట్టాలు ఇవ్వడంలో రెవెన్యూ అధికారులు జాప్యం చేస్తున్నారని, ఇంటి పట్టాలు ఇవ్వాలని కోరారు. అర్హులైన ప్రతిఒక్కరూ ఈనెల చివరిలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సహకార వారోత్సవాలు

పత్తికొండ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):పత్తికొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో గురువారం 72వ సహకార వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. సబ్ డివిజన్ అధికారి లక్ష్మీకాంత్‌రెడ్డి, సీనియర్ ఇన్‌స్పెక్టర్ విజయభారతి లు మాట్లాడుతూ సహకార సంఘాలు రైతుల కోసం పనిచేస్తాయన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రంగప్ప, సీఈవో యేసుప్రవక్త, డైరెక్టర్ సురేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిని నిర్మూలిద్దాం

మద్దికెర, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధిని నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలని లెప్రసీ డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ ధనలక్ష్మి, ప్రభుత్వ వైద్యాధికారిణి రాగిణి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మద్దికెర రామ్‌నగర్ కాలనీలో కుష్ఠు వ్యాధిపై జరుగుతున్న ఇంటింటి సర్వేను తనిఖీ చేశారు. సీహెచ్‌వో నిరంజన్‌బాబు, అక్బర్ బాషా, కృష్ణమ్మ, సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఏజెన్సీ బాధ్యతల నుంచి తప్పుకున్న నిర్వాహకులు

చిప్పగిరి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): చిప్పగిరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన ఏజెన్సీపై వచ్చిన ఫిర్యాదుల మేరకు ఏజెన్సీ నిర్వాహకులు భోజన నిర్వహణ బాధ్యతల నుంచి రెండు రోజుల క్రితం తప్పుకున్నారు. దీంతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు గురువారం పాఠశాల నిర్వహణ కమిటీ చైర్మన్ కొక్క నాగరాజు దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన ఆయన విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని తయారు చేయించి విద్యార్థులకు వడ్డించారు. అలాగే స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని తయారు చేసి విద్యార్థులకు వడ్డించారు. పాఠశాలలు, కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

టమోటా రైతుల్లో ఆనందం

● జత బాక్సు ధర రూ.1000 నుంచి రూ.1500


బిల్లేకల్ మార్కెట్‌లో వేలం నిర్వహిస్తున్న వ్యాపారులు

ఆస్పరి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పశ్చిమ భాగమైన ఆలూరు, పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూరు నియోజకవర్గాల్లో అధికంగా పండిస్తున్న టమోటాకు గిట్టుబాటు ధర లభ్యం కావడంతో పండించిన రైతుల్లో హర్షం వ్యక్తమ్మయింది. మండలకేంద్రమైన ఆస్పరి, బిల్లేకల్ టమోటా మార్కెట్లలో జత టమోటా బాక్సు రూ.1000 నుంచి రూ.1500 దాకా పలుకుతుండడంతో సాగుచేసిన రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది.

ఎన్‌కౌంటర్‌పై విచారణ జరిపించాలి

పత్తికొండ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నక్సలైజ్ కీలక నాయకుడు హిడ్మాతో పాటు వారి దళంపై జరిగిన ఎన్‌కౌంటర్‌పై సిట్టింగ్ జడ్జి చేత న్యాయ విచారణ జరిపించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజాసాహెబ్ గురువారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హిడ్మా ఆంధ్రప్రదేశ్‌లో అరెస్టు చేసిన పోలీసులు అడవుల్లోకి తీసుకెళ్లి కాల్చి చంపడం దుర్మార్గమన్నారు. మావోయిస్టుల సానుభూతిపరుల పేరుతోనే ప్రజలపై వేధింపులు ఆపాలన్నారు. కాల్పుల ఘటనపై న్యాయ విచారణ జరిపించాలన్నారు.

మాలలు అన్ని రంగాల్లో రాణించాలి


మాట్లాడుతున్న కుంకనూరు వీరేష్

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : మాల సామాజిక వర్గానికి చెందిన అందరూ అన్ని రంగాలలో రాణించాలని మాల మహానాడు పట్టణ గౌరవాధ్యక్షుడు కుంకనూరు వీరేష్ అన్నారు. గురువారం కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఆర్ట్స్ కళాశాల వెనుక ఉన్న బాలాజీ మఠంలో కార్తీక వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు గంగాధర్, గంగన్న, శ్రీనివాసులు గణేష్ మురళీ, నవీన్, ప్రశాంత్, కృష్ణ, తిక్కన్న సాయిరాం పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి


తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న గ్రామ సేవకులు

హాలహర్వి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా విధులు నిర్వహిస్తూ గ్రామాల్లో తాము సేవలందిస్తున్న ప్రతిఫలాలకు అనుగుణంగా తమ సమస్యలను పరిష్కరించాలని గ్రామ సేవకుల సంఘం అధ్యక్షులు తిమ్మప్ప డిమాండ్ చేశారు. గురువారం తమ సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ లకీ&నారాయణకు వినతి పత్రం అందించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ డిమాండ్లను నెరవేర్చాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సేవకుల సంఘం నాయకులు బసవరాజు, అంజి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

జుమాలదిన్నెలో ట్రాఫిక్ జామ్

● రెండు గంటల పాటు ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు

కోసిగి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కార్తీక అమావాస్య పర్వదినం కావడంతో ఉరుకుందకు భారీ సంఖ్యలో వాహనాలు పోటెత్తడంతో కోసిగి-జుమాలదిన్నె సమీపంలోని ప్రధాన రోడ్డుపై భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వందల సంఖ్యలో వాహనాలు రోడ్డుపైనే రెండు గంటల పాటు ట్రాఫిక్ జామ్‌లో ఇరుక్కుపోయాయి. దీంతో వాహనాదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గురువారం కార్తీక అమావాస్య సందర్భంగా మన రాష్ట్రంతో పాటు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వాహనంలో తరలిరావడంతో జుమాలదిన్నె గ్రామ సమీపంలో భారీగా ట్రాఫిక్ జామ్‌తో రోడ్డుపైనే వాహనాలు నిలిచిపోయాయి. రెండు గంటల పాటు వాహనదారులు, భక్తులు ఇబ్బందులు పడ్డారు. అనంతరం ట్రాఫిక్ క్లీయర్ కావడంతో వాహనాలు ముందుకు కదిలాయి.


జుమాలదిన్నెలో నిలిచిపోయిన వాహనాలు

ఆలయాల్లో అమావాస్య పూజలు


కోసిగయ్యస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

గోనెగండ్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం అమావాస్య పర్వదినం పురస్కరించుకొని ఈశ్వర దేవాలయాలు గురువారం తెల్లవారుజాము నుంచి భక్తులతో కిటకిటలాడాయి. శివనామ స్మరణతో మారుమోగాయి. కింది వీధి నీలకంతేశ్వరదేవాలయంలో వీరశైవ మఠం పీఠాధిపతి శివయ్యస్వామి మహారుద్రాభిషేకం బిల్వాలతో అర్చన అమ్మవారికి కుంకుమార్చన మహా మంగళహారతి నిర్వహించారు. వీవర్స్ కాలనీలో వెలసిన కాశీ నీలకంతేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోనెగండ్ల తో పాటు మండల పరిధిలోని గాజులదిన్నె, కులుమాల, అలువాల, హెచ్ కైరవాడి, పెద్దనేలటూరు, చిన్ననేలటూరు, వేముగోడు, గంజహల్లి, బైలుప్పల, అగ్రహారం గ్రామాల్లో అమావాస్య సందర్భంగా ఆలయాల్లో పూజలు నిర్వహించారు. గోనెగండ్లలో సాయంత్రం శివయ్య స్వామి భక్తులకు అన్నసంతర్పణ, అనంతరం భజన కార్యక్రమాలు నిర్వహించారు.

పెద్దకడబూరు: మండలంలోని బసలదొడ్డి గ్రామంలో వెలసిన పైరాయ ఆంజనేయస్వామి దేవాలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. కార్తీక పూజలను పురస్కరించుకొని యేటా భక్తులు స్వామివారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ ఏడాది కూడా భక్తులు స్వామివారికి ఉదయం నుంచే ప్రత్యేక పూజలు చేసి తమ మొక్కులను తీర్చుకున్నారు. శుక్రవారం స్వామివారి రథోత్సవాన్ని నిర్వహించనున్నారు.

కోసిగి: కోసిగి ప్రజల ఆరాధ్య దైవం కోసిగయ్య స్వామి (ఆంజనేయస్వామి)కి కార్తీక అమావాస్య కావడంతో ప్రత్యేక పూజలు చేశారు. గురువారం పెద్ద సంఖ్యలో భక్తులు ఆంజనేయస్వామి ఆలయంలో దీపాలు వెలిగించి పూజలు చేశారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించారు. అలాగే ఆంజనేయస్వామి ఆలయంలో రెండు రోజుల పాటు కార్తీక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు, ఈవో తెలిపారు.

'స్థానికత వర్తింపజేసేలా ఒత్తిడి చేయాలి'

ఎమ్మిగనూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం 2022లో ప్రవేశపెట్టిన శ్రేష్టపథకం కింద చదువుతున్న ఎస్సీ విద్యార్థులకు ఆయా రాష్ట్రాల స్థానికత వర్తించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని శ్రేష్ట పథకం విద్యార్థుల తల్లిదండ్రులు భీమన్న తదితరులు కోరారు. బుధవారం రాత్రి ఆదోని నుంచి విజయవాడకు వెళ్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్యను ఎమ్మిగనూరులో కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ శ్రేష్టపథకం విద్యార్థులకు శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 20తో వరుసగా నాలుగు ఏళ్లు రాష్ట్రంలో చదవాలని నిబంధనల ప్రకారం ర్యాంకుల ఆధారంగా ఆయా రాష్ట్రాలలో చదువుతున్న విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు మినహాయింపు ఇచ్చిన విధంగానే శ్రేష్ట పథకం ద్వారా ఎంపికై వివిధ రాష్ట్రాలలో చదువుతున్న విద్యార్థులకు స్థానికత వర్తింపచేయాలని కోరారు. ఇందుకు ఈశ్వరయ్య స్పందిస్తు ఈ విషయం తన దృష్టికి వచ్చిందని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఎం చంద్రబాబుకు లేఖ రాసినట్లు తెలిపారు. ఎస్సీ పేద విద్యార్థులకు అన్యాయం జరగకుండా వారికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు రజాక్, ప్రభు ఉన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

గోనెగండ్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థులు 10వ తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని, ఇందుకోసం ఇప్పటి నుంచే పట్టు దలతో కృషి చేయాలని బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాసులు, శిరిష సూచించారు. గోనెగండ్లలోని బీసీ బాలిక హాస్టల్‌లో గురువారం విద్యార్థులకు బెడ్‌షీట్స్, కార్పెట్‌లను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, రోజూ పాఠశాలకు వెళ్లి బాగా చదువుకోవాలని సూచించారు.

'వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి'

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో భక్తులు కార్తీక పూజా కార్యక్రమాలు, రథోత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని రూరల్ ఎస్ఐ కె.శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలోని పార్లపల్లి, మల్కాపురం, కె.తిమ్మాపురం, దైవందిన్నె, ఏనుగుబాల తదితర గ్రామాల్లో భక్తులు కార్తీక పూజలు నిర్వహిస్తున్నారని చెప్పారు. అయితే కార్తీక పూజల సందర్భంగా నిర్వహించే రథోత్సవాల్లో ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా పార్లపల్లి గ్రామంలో ఇరువర్గాల ప్రజలు శాంతియుతంగా ఉండి రథోత్సవాన్ని నిర్వహించుకోవాలన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలలో పని చేస్తూ బదిలీపై వెళ్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను ఎస్ఎంసీ మహబూబ్ పాషా ఆధ్వర్యంలో ఘన వీడ్కోలు పలికారు. బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ వారు అందించిన సేవలు మరువలేమని, వారి బోధనలు, కృషి ఫలితంగా విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఎందరో ఉన్నారని, వారి ఉజ్వల భవిష్యత్తుకి పునాదులు వేశారని అన్నారు. ప్రిన్సిపాల్ సామ్రాజ్యం మాట్లాడుతూ తనకు సహాయ సహకారాలు అందించిన పాఠశాల యాజమాన్యం, తోటి ఉపాధ్యాయు లకు ప్రత్యే కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ నాయకులు ప్రసాద్, అంబేద్కర్, పాండు, సతీష్ పాల్గొన్నారు.

రోడ్లపై గుర్రాల స్వైర విహారం


రోడ్డుపై వెళ్తున్న గుర్రాలు

గోనెగండ్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గోనెగండ్లతో గాజులదిన్నె, హెచ్‌కైరవాడి, వేముగోడు, కులుమాల, అలువాల గ్రామాల్లో గత నెల రోజులుగా గుర్రాలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఆయా గ్రామాల్లో ని వీధుల్లో అతి వేగంగా పరిగెత్తడంతో ఆరుబయట ఉన్నవారికి, వాహనదారులకు తగలడంతో వారు గాయాల పాలవుతున్నారు. రహదారులకు అడ్డంగా గుర్రాలు నిలిచి ఉండటం వల్ల ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అలాగే రాత్రిపూట గ్రామశివార్ల లో ఉన్న పొలాలపై పడి ఉన్న అరకొర పంటను నాశనం చేస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయితీ సిబ్బంది గుర్రాలను పట్టుకొని వాటి యజమానులకు అప్పగించాలని ప్రజలు కోరుతున్నారు.

'ఉపాధ్యాయులకు అండగా ఉంటాం'

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు అండగా ఉంటామని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి తెలిపారు. మండలంలోని రాంనగర్, గుడికల్, ఆస్పరి గ్రామాలలో గురువారం సభ్యత్వ నమోదు చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ ప్రస్తుతం విద్యా ఉపాధ్యాయ రంగ సమస్యల తీరుపై అప్టా నాయకుల స్పందన, పరిష్కారానికి కృషి చేస్తున్నామని చెప్పారు. ఉపాధ్యాయ సమస్యలను తీరుస్తూ ఉపాధ్యాయులకు అండగా వృత్తిపరమైన ఎట్టి సమస్యలకు అయిన ఈ సంఘం ముందుండి పరిష్కారం చూపిస్తుందన్నారు. వినోద్ తదితరులు పాల్గొన్నారు.

'రైతు సమస్యలు పరిష్కరిస్తాం'



సమస్యలపై విచారిస్తున్న తహసీల్దార్

నందవరం, నవంబరు 20(ఆంధజ్యోతి): రైతు సమస్యలు పరిష్కరిస్తామని తహసీల్దార్ శ్రీనివాసులు చెప్పారు. నందవరం తహసీల్దారు కార్యాలయానికి గురువారం రైతులు అధిక సంఖ్యలో వచ్చారు. నందవరానికి చెందిన వెంకటేశ్వర్లు పొలం విషయాన్ని వీఆర్వోతో విచారించి సమస్య పరిష్కారం దిశగా చర్యలు తీసుకున్నారు. అలాగే నాగలదిన్నెకు చెందిన జంగం కవిత ఇంటి పట్టా స్థలం గురించి విచారించారు. అలాగే హలహర్వి గ్రామానికి చెందిన గత కోనేళ్ల తాము సాగులో ఉన్న భూమి తమదంటూ ఇతరులు వస్తున్నారని విచారించాలని డీస్ట్రిబ్యూటరీ చైర్మన్ గోవర్దన్‌రెడ్డి కోరారు. తాను పొలం దగ్గరికి వచ్చి సర్వేయర్ ఇచ్చిన మ్యాప్ ఆధారంగా విచారణ జరిపి న్యాయం చేస్తానని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు మహేష్, వీఆర్వో తిప్పన్న పాల్గొన్నారు.

ఎల్లెల్సీలో మహిళ మృతదేహం

కౌతాళం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన మహిళ ఎల్లెల్సీ కాలువలో శవమై తేలింది. కౌతాళం సీఐ అశోక్ కుమార్ తెలిపిన వివరాలివీ.. తెలంగాణ రాష్ట్రం జోగులాంబ గద్వాల్ జిల్లా పులకల్ గ్రామానికి చెందిన కోటేశ్వరి(21)కి కామవరం గ్రామానికి చెందిన వీరేశ్‌తో ఈ ఏడాది ఫిబ్రవరిలో వివాహమయింది. అయితే తన కూతురు కనబడం లేదని ఆమె తండ్రి మద్దిలేటి బుధవారం కౌతాళం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. అయితే గురువారం ఉదయం కామవరం-పెద్దతుంబళం గ్రామాల మధ్య ఉన్న ఎల్ఎల్‌సీ కాలువలో మహిళ శవం ఉందని సమాచారం రావడంతో పోలీసులు శవంను బయటకు తీశారు. మృతి చెందిన మహిళ కోటేశ్వరిగా తండ్రి గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

'కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి'


అధికారికి వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు, నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, తక్షణమే కార్మికుల సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలని ఏపీ భవన నిర్మాణ కార్మికులు యూనియన్ కన్వీనర్ ఉస్మాన్‌వలి, సీఐటియు మండల అధ్యక్షుడు గోవిందు డిమాండ్ చేశారు. పట్టణంలోని భవన నిర్మాణ కార్యాలయం వద్ద వారు మాట్లాడుతూ దాదాపు పది సంవత్సరాల నుంచి దాదాపు కోట్ల రూపాయలు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్నాయన్నారు. కార్మికుల శేష నిధులను రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలకు ఖర్చు పెట్టడం సరికాదన్నారు. గత వైసీపీ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుకు వ్యతిరేకంగా జీవో నెంబర్లు 12,14 తెచ్చి కార్మికుల నిధిని రూ.1800 కోట్లను జగన్ తన ఫొటో వేసుకొని ఖర్చు చేశారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామని 50 సంవత్సరాల వయస్సు వారికి నెలకు రూ10వేలు ఇస్తామని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కార్మికులకు గుర్తింపు కార్డులు, పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్ తదతర సమస్యలు పరిష్కారించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ తాలుకా కార్యదర్శి రాముడు, లాలు, మధు, బాషా పాల్గొన్నారు.

రజత గజ వాహనంపై ప్రహ్లాదరాయలు


రజత గజవాహనంలో స్వర్ణ అంబారిపై విహరిస్తున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు రజత గజవాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. గురువారం రాఘవేద్రస్వామి సజీవ సమాధి పొందిన శుభదినం, అమావాస్యను పురస్కరించుకుని పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళ వాయిద్యాల మధ్య రజిత గజవాహనంపై స్వర్ణ అంబారిలో ప్రహ్లాదరాయలను అధిష్టించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు.

రాఘవరాయలకు స్వర్ణ కవచ సమర్పణ సేవ

వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవ్రేంద స్వామి మూల బృందావనానికి బంగారు కవచ సమర్పణ సేవ చేశారు. రాఘవేంద్రస్వామి సజీవ సమాధి పొందిన గురువారం కార్తీక అమావాస్యను పురస్కరించుకొని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో మఠం పండితులు బృందావనానికి సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, తులసి అర్చన, విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. బంగారు, వెండి, పట్టు వస్త్రాలు, బెంగుళూరు నుంచి తెచ్చిన ప్రత్యేక పుష్పాలు, బంగారు కవచంతో అలంకరించారు. హస్తోదకం చేసి మహా మంగళహారతులు ఇచ్చారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో తిక్కారెడ్డి


శ్రీమఠంలో తిక్కారెడ్డి, నాయకులు

మంత్రాలయం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి దర్శనార్థం టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి గురువారం మంత్రాలయానికి వచ్చారు. ఆయనకు ఆలయ మహా ముఖద్వారం వద్ద మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, సురేష్‌కోనాపూర్, శ్రీపతి ఆచార్ ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనంను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి రాఘవేంద్ర స్వామి మెమెంటో, ఫల, పుష్ప, మంత్రాక్షితలు , పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో వ్యాసరాజ ఆచార్, టీడీపీ మండల కన్వీనర్ వెంకటేశ్వర్లు, టీడీపీ బీసీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు అమర్నాథరెడ్డి, కృష్ణ మోహన్ రెడ్డి, నారాయణ, అబ్దుల్లా, కేశన్న, ఈరన్న, తిక్కస్వామి గౌడు, రామకృష్ణ, నరసింహ, యేబు, సుంకప్ప, నర్సారెడ్డి, నాగరాజు, గురురాజు, దస్తగిరి ఉన్నారు.

'జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో రాణించాలి'


విద్యార్థినులను అభినందిస్తున్న డీఎస్పీ భార్గవి

గోనెగండ్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి అండర్ 19 బేస్ బాల్ పోటీల్లో రాణించాలని ఎమ్మిగనూరు డీఎస్పీ భార్గవి ఆకాంక్షించారు. గోనెగండ్లలో ని కేజీబీవీలో ఇంటర్మీడియట్ చదువుతున్న రాజేశ్వరి, సుమలత జాతీయ స్థాయి అండ్ 19 బేస్ బాల్ క్రీడలకు ఎంపికయ్యారు. ఈ నెల 15 నుంచి 17వరకు రైల్వేకోడూరు నందు జరిగిన రాష్ట్ర స్థాయి అండర్ 19బేస్ బాల్ పోటీ ప్రతి కనపరిచారు. ఎమ్మిగనూరు డీఎస్పీ భార్గవి గురువారం గోనెగండ్లలోని కేజీబీవీకి వెళ్లి రాజేశ్వరి, సుమలతను పూలమాల, శాలువతో సన్మానించి షీల్డ్ అందజేసి అభినందించారు. అనంతరం శక్తి టీం గురించి పాఠశాల బాలికలకు వివరించారు. ఎంఈవోలు రామాంజినేయలు, నీలకంఠ, కేజీబీవీ ఎస్‌వో విద్యావతి, కల్యాణి, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రాలయం: మంత్రాలయం జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం విఠోబరావు, ఫిజికల్ డైరెక్టర్లు రవీంద్ర, నరసింహరాజు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ అండర్-19 జిల్లాస్థాయి, రాష్ట్ర స్థాయిలో బాలబాలికల సెపక్‌తక్రా పోటీల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి రాధమ్మ విశేష ప్రతిభ కనపర్చి జాతీయ స్థాయికి ఎంపిక కావడంపట్ల మంత్రాలయానికి గుర్తింపు వచ్చిందని కొనియాడారు. జాతీయస్థాయి పోటీల్లో మరింత ఉత్సాహంతో ఆడాలని కోరారు. కార్యక్రమంలో గోట్ల చంద్రశేఖర్, పాపన్న, వీరేష్‌రావు, అనూరాధ, రామచంద్ర, ఉమామహేశ్వరి, గోపాల్, ప్రసన్న కుమారి అభినందించారు.


మంత్రాలయంలో విద్యార్థిని అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

'ఉద్యోగావకాశాలు కల్పించాలి'



రోడ్లను శుభ్రం చేస్తూ నిరసన తెలుపుతున్న బాధిత కుటుంబాల సభ్యులు

ఎమ్మిగనూరు టౌన్/రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉద్యోగావకాశాలు తమకు కల్పించాలని మున్సిపాలిటీలో విధులు నిర్వర్తిస్తూ మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులు కోరారు. పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో 4వ రోజు గురువారం రోడ్లను శుభ్రం చేస్తూ వినూత్నంగా నిరసన చేపట్టారు. ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో దీక్ష శిబిరం నుంచి కార్మికులతో ర్యాలీ చేపట్టి సోమప్ప సర్కిల్‌లో రోడ్లను శుభ్రం చేస్తూ వినూత్నంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి తిమ్మగురుడు, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ మాట్లాడుతూ కార్మికులు చనిపోయినప్పటి నుంచి వారి కుటుంబ సభ్యుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. మొన్నటి రోజున ఉద్యోగాలు ఇస్తామని హడావుడి చేసిన కమిషనర్ ఇప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. కార్మికుల శ్రమను దోచుకొని తీరా వారు మరణించిన తర్వాత వారి కటుంబ సభ్యులకు ఉద్యోగాలు కల్పించకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ ఇన్‌చార్జి ఖాశీంవలి, ఎన్ఎస్‌యూఐ నాయకుడు వీరేశ్‌యాదవ్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఎల్లప్ప, శివ, ప్రతాప్, విజయేంద్ర, భీమన్న తదితరులు పాల్గొన్నారు.

'రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం'


పీఎం, సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

గోనెగండ్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ మండల టీడీపీ కన్వీనర్ తిరుపతయ్యానాయుడు, సింగిల్ విండో అధ్యక్షుడు రామాంజినేయులు, టీడీపీ మైనార్టీ నాయకులు బేతాలబడేసా అన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారాలబ్ధిపొందిన రైతులు గురువారం గోనెగండ్లలో సంబరాలు చేసుకున్నారు. టీడీపీ కార్యాలయం దగ్గర కూటమి నాయకులు పీఎం నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మహల్ రహంతుల్లా, పట్టణ మాజీ అధ్యక్షుడు రమేష్‌నాయుడు, అడ్వకేట్ చంద్రశేఖర్, మురళీనాయుడు, నూరహమ్మద్, కాంట్రాక్టర్ షేక్షావలి, గౌండ రహంతుల్లా, డాక్టర్ మిన్నల్ల, రంగస్వామినాయుడు, మేకల మునెప్ప, జనసేన నాయకులు గానుగ బాషా, బీజేపీ నాయకులు రమేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థలం పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శేషఫణి

ఎమ్మిగనూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడికల్ గ్రామంలో ఈఎస్ఐ డిస్పెన్సరీ భవనం నిర్మాణం కోసం తహసీల్దార్ శేషఫణి గురువారం స్థలాన్ని పరిశీలించారు. గ్రామ పరిధిలో ఉన్న ఎకరన్నర గ్రామ కంఠకం భూమిని సర్వే చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఈఎస్ఐ డిస్పెన్సరీ భవనం నిర్మాణం కోసం గ్రామకంఠకంగా ఉన్నస్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. భవన నిర్మాణానికి అవసరమైన 50 సెంట్ల స్థలాన్ని సర్వే చేసి స్థలానికి సంబంధించిన వివరాల నివేదికను జేసీకి పంపుతామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ, సచివాలయం సిబ్బంది మోహన్ పాల్గొన్నారు.

'జీతాలు పెంచాలి'


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్ఏలు

పెద్దకడబూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తక్షణమే వీఆర్ఏలకు పే స్కేల్, జీతాలు పెంచాలని వీఆర్ఏల సంఘం నాయకులు రమేష్, చిన్న నరసయ్య డిమాండ్ చేశారు. పెద్దకడబూరులోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం సీపీఎం నాయకుడు తిక్కన్న ఆధ్వర్యంలో వీఆర్ఏలు తహసీల్దార్ గీతాప్రియదర్శినికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ అర్హత ఉన్న వీఆర్ఏలకు వీఆర్వో, రికార్డు అసిస్టెంట్లుగా ప్రమోషన్లు కల్పించాలన్నారు. అలాగే ఏళ్ల తరబడి పనిచేస్తున్న వారిని వీఆర్ఏలుగా నియమించాలన్నారు. అటెండర్, నైట్‌వాచ్‌మెన్ ప్రమోషన్ కోటాను 20శాతం నుంచి 70శాతానికి పెంచాలన్నారు. కార్యక్రమంలో నాగప్ప, పెద్దమహదేవ్, నాగేష్, నరసింహులు పాల్గొన్నారు.

ఆధార్ అనుసంధానం చేసుకోవాలి

కౌతాళం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మేజర్ గ్రామ పంచాయతీ కౌతాళం ప్రజలు తాము నివసిస్తున్న ఇంటి రసీదులకు పంచాయతీ కార్యాలయంలో తమ ఆధార్ నంబరుతో అనుసంధానం చేసుకోవాలని సర్పంచ్ పాల్‌దినకరన్, పంచాయతీ కార్యదర్శి ప్రకాశం తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల ఆవాస చిరునామాలకు సంబంధించి ఆన్‌లైన్‌లో తమ చిరునామాలు భద్రపరుస్తోందని చెప్పారు. ప్రజలు తమ ఇంటి పన్ను రశీదులతో పాటు తమ సెల్ నెంబరు తీసుకుని పంచాయతీ కార్యాలయంలో ఇవ్వాలని తెలిపారు. ఈ నెల చివరిలోపు ప్రజలందరూ ఆధార్‌లింక్ చేయించుకోవాలన్నారు. దీని వల్ల ఆన్‌లైన్ ద్వారా తమ ఇంటి బకాయిలను తెలుసుకుని చెల్లింపులు కూడా చేయవచ్చని, దీంతో పంచాయతీకి ఆదాయం కూడా సమకూరుతుందని చెప్పారు.